Rni Title Code No. TELTEL02115

## పీఎస్ఎల్వీ-సీ56 నాలుగో దశకు కక్ష్య తగ్గింపు

బెంగళూరు : ఇస్రో ఇటీవల చేపట్టిన పీఎసఎల్వీ-సీ56 ప్రయోగానికి సంబంధించి కీలక పరిణామం చోటు చేసు కుంది. పీఎసఎల్వీ-సీ56 రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్-4) ద్వారా ఇస్రో గత నెల 30న ఏడు విదేశీ ఉపగ్రహాలను భూమికి 535 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో విడిచిపెట్టింది. అయితే పీఎస్-4 కక్ష్యను అక్కడి నుంచి 300 కిలోమీటర్ల స్థాయికి తగ్గించింది. ఆదివారం ఈ కక్ష్య మార్పు ప్రక్రియను చేపట్టేందుకు లోథ్రస్ట్ ఇంజన్లను రెండుసార్లు మండించి కక్ష్య తగ్గింపు ప్రక్రియను విజయ వంతంగా చేపట్టింది. ఇలా తక్కువ ఎత్తుకి రావడం వల్ల ఇది త్వరగా భూకక్ష్యలోకి ప్రవేశించి పడిపోతుంది. దీంతో అంతరిక్షంలో ఇలాంటి ప్రయోగాలకు సంబంధించిన వ్యర్థాలు తగ్గుతాయి.


# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 198 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 ఆగస్టు 2023 మంగళవారం పేజీలు : 4


# పెరిగిపోతున్న పొలిటికల్ హీట్!




## కుల సంఘాలపై రాజకీయ పక్షాల దృష్టి

### - జనంతో మమేకమవుతూ కార్యక్రమాలు
### - సోషల్ మీడియా ప్రచారానికి ప్రత్యేక బ్యాచ్
### ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్న నేతల పర్యటనలు

జగిత్యాల : రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు సమీపిస్తుండడంతో పల్లెలు, పట్టణాల్లో పొలిటికల్ సందడి నెల కొం ది. ప్రధాన రాజకీయ పక్షాల నేతలంతా ప్రజల వద్దకు పరుగులు తీస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలను ఆకర్శించడానికి య త్నిస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలతో పా టు చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల, వేము లవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో అ టు అధికార పక్ష నేతలు, ఇటు ప్రతిపక్ష పార్టీ నేతలు జోరుగా కార్యక్ర మాలను నిర్వహిస్తున్నారు. తొమ్మిదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి కార్య క్ర మాలు నిర్వహించామని వివరిస్తూ అధికార బీఆర్ఎస్ నేతలు పర్యటన లు సాగిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేపట్టిన పథకా లు, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ కమలనాథులు ఎన్నికల ప్రచారా న్ని తలపిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియమ్మే అంటూ అధికారంలోకి వస్తే గతంలో మాదిరిగా అభివృద్ధి చేపడుతామని కాంగ్రెస్ నేతలు ప్రజలవద్దకు వెళ్తున్నారు. ఇదే విధంగా తెలంగాణ జన సమితి, వైఎస్సార్ టీపీ, జనసేన, తెలుగుదేశం, ఎంఐఎం, కమ్యూనిస్టు పార్టీలు సైతం పల్లెల్లో తమ ప్రాబల్యాన్ని పెం చుకోవడంపై దృష్టి సారించాయి.

**ముఖ్యనేతల నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు...** జిల్లాలోని ప్రధాన పట్టణాలయిన జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపు రి, రాయికల్‌లతో పాటు మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచా యతీలు, పంచాయతీల్లో ప్రధాన రాజకీయ పక్షాల నేతల నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు పార్టీ ప్రచారంపై దృష్టి సారించారు. నిత్యం ప్రజ ల్లో ఉంటూ కార్యక్రమాలు చేపట్టడంలో మునిగి తేలుతున్నారు. ఆయా నియోజకవర్గాలకు బాధ్యత వహిస్తున్న నేతలు కార్యకర్తలను పురమాయిస్తూ పలు అంశాలపై చేయాలన్న అంశాలపై దిశానిర్దేశం చేస్తున్నారు.

**కుల సంఘాలపై పార్టీల గురి..** జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ప్రభావం చూపే సామాజిక వర్గా లపై పార్టీలు గురిపెట్టాయి. జిల్లాలో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో సా మాజిక వర్గం ప్రభావం చూపనుండడంతో ఏ నియోజకవర్గానికి సం బం ధించి ఆ నియోజకవర్గం వారిగా ప్రణాళికలు రూపొందిస్తూ అవసరమై న రాజకీయ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ముస్లిం మైనార్టీ, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలను ఆకర్శించడంపై దృష్టి సారిస్తున్నారు. ఇదే స మయంలో జనరల్ ఓటర్లను సైతం మచ్చిక చేసుకోడానికి యత్నిస్తున్నా రు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజ కవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎ క్కువగా ఉండడంతో సంబంధిత అంశంపై సైతం పార్టీలు గురిపెట్టాయి.

**సోషల్ మీడియా వేదికగా ప్రచారం..** రోజురోజుకు మారుతున్న సాంకేతికతను అనుసరిస్తూ పార్టీలు సోషల్ మీడి యా ప్రచారంపై దృష్టి సారించాయి. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రత్యేకంగా సోషల్ మీడియా బ్యాచ్‌లను ఏర్పాటు చే సుకున్నాయి. ఆయా నియోజకవర్గాల్లో సంబంధిత పార్టీల నేతల పర్యట నలు, ప్ర చారాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు వివరిస్తూ ఏ రోజుకారోజు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతూ ప్రచారం చే స్తున్నారు.

**సెగ్మెంట్ల క్లీన్ స్వీప్‌పై దృష్టి...** జిల్లాలోని ధర్మపురి, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో తమతమ పార్టీల జెండాలను ఎగురవేసి క్లీన్ స్వీప్ చేయడంపై ప్రధాన రాజకీయ పక్షాలు దృష్టి సారించాయి. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ప్రాతిని త్యం వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యా సాగర్ రావు, డాక్టర్ సంజయ్ కుమార్ మరోమారు సత్తా చాటేందుకు ఉ వ్విళ్లూరుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్టీ గెలుపు బాధ్యతలను నిర్వర్థిస్తూ బలోపేతంపై దృష్టి సారించారు. అదేవిధంగా బీజేపీ, ఇతర పార్టీలకు చెందిన పలువు రు నేతలు సైతం రానున్న ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిజామాబాద్ పార్లమెంట్‌కు చెందిన ఎంపీ ధర్మపురి అరవింద్ బీజేపీ గెలుపు కోసం, ఎమ్మె ల్సీ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ విజయంపై దృష్టి సారించి కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తున్నారు. ధర్మపురి, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల పరిధిలో కరీంనగర్ పార్లమెంట్‌కు చెందిన ఆయా పా ర్టీల నేతలు దృష్టి సారించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, పల్లెల్లో ఎన్నికల వాతావరణం నెలకొంటోంది.




హైదరాబాద్: ప్రజా యుద్ధ నౌక గద్దర్ భౌతికకాయం అల్వాల్‌లోని భూదేవినగర్‌లో సొంత నివాసానికి చేరుకుంది. అక్కడ ముఖ్యమంత్రి కేసీఆర్.. గద్దర్‌కు నివాళులర్పించారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా నివాళులర్పించారు. మహాబోధి స్కూల్ గ్రౌండ్‌లో అంత్యక్రియలు జరిగాయి. ఈ అంత్యక్రియల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. అంతకముందు 6 గంటల పాటు భాగ్యనగరంలో 17 కిలోమీటర్లు అంతిమయాత్ర సాగింది. ఈ యాత్రలో పెద్ద ఎత్తున కళాకారులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆయా పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘాల నేతలు, కళాకారులు గద్దర్‌కు నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతం అయ్యారు.

## హై కమాండ్ టోటల్ కంట్రోల్ లో టీ కాంగ్రెస్...!

హైదరాబాద్ : తెలంగాణా కాంగ్రెస్ వ్యవహారాలు అన్నీ కూడా డైరెక్ట్ గా ఢిల్లీ నుంచే ఇపుడు సాగుతున్నాయి. కేంద్ర కాంగ్రెస్ పెద్దలే ప్రతీ మ్యాటర్ ని స్టాడీ చేసి ఓకే చేస్తున్నారు. పార్టీలో చేరికలను అయితే వారే దగ్గరుండి మరీ చూసుకుంటున్నారు. ఈ నేపధ్యంలో అంతా రివర్స్ గానే ఉందని అంటున్నారు. నిజానికి ఇప్పటిదాకా కాంగ్రెస్ వ్యవహారం చూస్తే లోకల్ గా లీడర్స్ మాట్లాడుకుని పీసీసీ చీఫ్ ఇతర పెద్దల ను కలిస్తే ఆ తరువాత లాంచనంగా కేంద్ర కాంగ్రెస్ పెద్దల తో భేటీ అయ్యేవారు.

కానీ ఇపుడు సీన్ మొత్తం రివర్స్ గా సాగుతోంది. ఢిల్లీకే నేరుగా వెళ్ళి గాంధీ త్రయాన్ని కలుస్తున్నారు. ఆ తరువాత మల్లికార్జున ఖర్గేతో భేటీ అవుతున్నారు. అక్కడే జాయింగ్స్ తో పాటు తమ కోరికల చిట్టాను విప్పుతూ అంతా ఓకే చేసుకుని మరీ హైదరాబాద్ లో ల్యాండ్ అవుతున్నారు. పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి అయినా జూపల్లి క్రిష్ణారావు అయినా మరో నేత అయినా ఇదే తీరుగా కాంగ్రెస్ లో వ్యవహారాలు ప్రస్తుతం సాగుతున్నాయి. ఇదిలా ఉంటే తెలంగాణా కాంగ్రెస్ వ్యవహారాల ను పక్కాగా చూసేందుకు పక్క రాష్ట్రానికి చెందిన కర్నాటక పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ ఉండనే ఉన్నారు. ఆయన కర్నాటక లో కాంగ్రెస్ ని గెలిపించిన అనుభవాన్ని రంగరించి మరీ హై కమాండ్ కి సలహాలు ఇస్తూ టీ కాంగ్రెస్ రధాన్ని స్పీడ్ గా తిప్పేలా చూస్తున్నారు. ఇక ఈ జాయినింగ్స్ లో కూడా గమ్మత్తు ఉ



ంది. చాలా మంది సీనియర్లకు ఒక నేత రావడం ఇష్టం ఉందో లేదో తెలియదు వారు అడ్డుపుల్లలు వేస్తారు అని అంటూంటారు. అందుకే తమ అవసరాల కు తగినట్లుగా నేతలను చేర్చుకుంటూ అంతా కలసి పనిచేయాలన్న సందేశాన్ని కేంద్ర కాంగ్రెస్ టీ కాంగ్రెస్ నేతల కు ఇస్తోంది అని అంటున్నారు. దాంతో ఈ మొత్తం వ్యవహారాలు అన్నీ కూడా కో ఆర్డినేషన్ తో సాగుతున్నాయి. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పెద్ద అంటే మిగిలిన సీనియర్లకు కోపం ఉండొచ్చు. ఆయనను కలిస్తే తమను కూడా జాయిన్ అయ్యే నేతలు ఎందుకు కలవలేదు అని అలక పూనవచ్చు. అందుకే హై కమాండే ఫీల్డ్ లోకి దిగుతోంది అని అంటున్నారు. ఒక విధంగా తెలంగాణా ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ చేస్తున్న ఈ తరహా కసరత్తు మంచి ఫలితాలే ఇస్తుందని అంతా నమ్ముతున్నారు. ఒక వైపు హై కమాండ్ మరో వైపు ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ ఉండడంతో టీ కాంగ్రెస్ నేతల మధ్య ఆటోమేటిక్ గా సర్దుబాటు కుదురుతోంది అని అంటున్నారు. పార్టీని గెలుపు తీరాలను నడిపిస్తున్న వేల ఏ ఒక్కరూ పక్కకు జరగకుండా కాంగ్రెస్ పెద్దలు బాగానే చర్యలు తీసుకుంటున్నారు అని అంటున్నారు.

అందుకే తాజాగా జరుగుతున్న కొన్ని పరిణామాలు ట్రెడిషనల్ కాంగ్రెస్ శైలికి భిన్నంగా ఉన్నాయని అంటున్నారు. ముందు ఢిల్లీ ఆ తర్వాత బెంగుళూరు ఆ మీదట హైదరాబాద్ ఇలా కాంగ్రెస్ పార్టీలో చేరికలు కానీ మాటా మంతీ కానీ తమ డౌట్లు కానీ తీర్చుకునేందుకు నేతలు అవలంబిస్తున్న మార్గాలుగా చబుతున్నారు. ఇవన్నీ చూస్తూంటే ఒక సందేహం అయితే వస్తోంది. టీ కాంగ్రెస్ లోకల్ లీడర్ షిప్ ని అలా సైలెంట్ మోడ్ లో ఉంచేస్తున్నారా అని. కానీ తప్పదు కాంగ్రెస్ జెండా ఎగరాలంటే ఒకరిని పెద్దగా చేయడం కానీ మరోకరిని చిన్నగా చేయడం కానీ కాంగ్రెస్ చేయదలచుకోలేదు అని అంటున్నారు. అందుకే డైరెక్ట్ హై కమాండ్ కంట్రోలింగ్ లోకి కథ మొత్తం వెళ్ళిపోయింది అంటున్నారు.

# నేతన్నల కోసం చేనేత మిత్ర


## ఈ నెల నుంచే ప్రతి మగ్గానికి రూ. 3 వేలు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : రాష్ట్రంలోని నేతన్నల కోసం చేనేత మిత్ర అనే పథకాన్ని ఈ నెల నుంచే అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. చేనేతమిత్ర పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు రూ. 3 వేలు ఇస్తామన్నారు. మన్నెగూడలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. చేనేత మీద 5 శాతం జీఎస్టీ వేసిన మొట్టమొదటి ప్రధాని మోదీ అని కేటీఆర్ మండిపడ్డారు. చేనేత వద్దు.. అన్ని రద్దు అనేలా కేంద్రం తీరు ఉందని ధ్వజమెత్తారు. కేంద్రం చేనేతకారులపై మరిన్ని భారాలు వేస్తుందన్నారు. చిన్నప్పుడు చేనేతకారుల ఇంట్లో ఉండి సీఎం కేసీఆర్ చదువుకున్నారు. చేనేత కార్మికుల గురించి సీఎం కేసీఆర్‌కు తెలిసినంత ఎవరికి తెలియదు. సీఎం కేసీఆర్ చేనేతకు చేయూత పథకం తీసుకొచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు.

**చేనేతలకు రూ. 200 కోట్ల రుణాలు..** చేనేతలకు డీసీసీబీ, టెస్కాబ్ ద్వారా రూ. 200 కోట్ల రుణాలు అందిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. చేనేతలు తమ నివాసాల వద్ద షెడ్ నిర్మించుకునేందుకు సాయం చేస్తామని ప్రకటించారు. నేతన్నకు చేయూత ద్వారా 59 నుంచి 75 ఏండ్ల వరకు బీమా అమలు చేస్తున్నాం. ఈ పథకం ద్వారా రూ. 5 లక్షల బీమా కల్పిస్తామన్నారు. చేనేత హెల్త్ కార్డుల ద్వారా ఓపీ సేవలకు రూ. 25 వేలు ఇస్తామని ప్రకటించారు.

నేటి నుంచి తెలంగాణ చేనేత మగ్గం పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ. 40.50 కోట్లతో 10,652 ఫ్రేమ్ మగ్గాలు అందుబాటులోకి తెస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

**నేతన్నల కోసం చేనేత హెల్త్ కార్డు..** మృతి చెందిన కార్మికుల కుటుంబానికి టెస్కో సాయం రూ. 25 వేలకు పెంచుతామని కేటీఆర్ తెలిపారు. నేతన్నల కోసం చేనేత హెల్త్ కార్డు ప్రారంభిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులను కాపాడుకుంటానని 2001లోనే సీఎం కేసీఆర్ చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారు. వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశాం. శ్రామికులుగా సూరత్ వెళ్లి పారిశ్రామికులుగా స్వరాష్ట్రం తిరిగి వచ్చారు. ఉప్పల్‌లో అద్భుతమైన హ్యాండ్‌లూం మ్యూజియం నిర్మిస్తాం. పోచంపల్లి హ్యాండ్‌లూం పార్కును రూ. 12.60 కోట్లతో పునరుద్ధరణ చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు.



గరుడ వార్త



# సంపాదకీయం

## సభ నిర్వహణలో ఎన్డీయే ఫెయిలైనట్లేనా ?

పార్లమెంటు ఉభయ సభలను సజావుగా నిర్వహించటంలో ఎన్డీయే పూర్తిగా ఫెయిలైపోయింది. అధికార, ప్రతిపక్ష సభ్యులు తన మాట వినడం లేదు కాబట్టి తాను లోక్ సభకు రానని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించటం సంచలనంగా మారింది. ప్రకటించటమే కాదు అసలు సభలోకి అడుగుపెట్టనేలేదు. కారణం ఏమిటంటే అధికార, ప్రతిపక్ష ఎంపీల్లో ఎవరూ తన ఆదేశాలను లెక్కచేయటం లేదట. అలాంటపుడు తాను సభకు ఎందుకు రావాలన్నది స్పీకర్ లాజిక్. ఇక రాజ్యసభ విషయాన్ని తీసుకుంటే ప్రధానమంత్రిని సభకు రావాల ని తాను ఆదేశించలేనని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ థన్ కడ్ తన అశక్తతను అంగీకరించారు. ఉభయసభల కు ప్రతిపక్ష ఎంపీలు వచ్చినా రాకపోయినా అధికార పార్టీ ఎంపీలు మాత్రం వచ్చితీరాలి. అలాగని రూలేమీలేదు. కానీ సభాకార్యక్రమాల ను అధికారపార్టీయే పట్టించుకోకపోతే ఇక ప్రతిపక్ష ఎంపీలు ఎందుకు పట్టించుకుంటారు ? కాబట్టి ప్రశ్నలడిగిన ఎంపీలు, సమాధానాలు చెప్పాల్సిన మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు కచ్చితంగా పార్లమెంటుకు హాజరవ్వాల్సిందే. వీళ్ళంతా సభకు హాజరవ్వాలంటే ప్రధానమంత్రి హాజరవ్వాలి. ప్రధాని ఉభయసభల కు హాజరవుతుంటే ఆ భయంతో మిగిలిన వాళ్ళు కూడా హాజరవుతారు. కానీ ఇక్కడ నరేంద్రమోడీయే సభలకు రారు. అలాంటపుడు ఇక ఎంపీలు హాజరవ్వాలని ఎవరు ఆదేశించాలి ? ఉభయసభల కు హాజరవ్వటం, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పటం నరేంద్రమోడీ బాధ్యత. అయితే మోడీ తన బాధ్యతల ను సక్రమంగా నిర్వర్తించటం లేదు. ఒకవేళ సమావేశాల కు హాజరైనా చూస్తు ఊరుకుంటారే కానీ ఏమీ మాట్లాడరు. సభలో మాట్లాడాల్సిన విషయాల పై బయట పబ్లిక్ మీటింగ్ లోను, పార్లమెంటరీ పార్టీ మీటింగుల్లోను మాట్లాడుతారు. రాజ్యసభకు రావాల ని మోడీని ఛైర్మన్ నిర్దేశించలేకపోవచ్చు. అయితే రావాల్సిన నైతిక బాధ్యత ను గుర్తుచేయచ్చు కదా. ఆ పని కూడా తాను చేయలేనని జగదీప్ చెప్పేయటమే ఆశ్చర్యంగా ఉంది. మణిపూర్ అల్లర్ల పై సభలో దీర్ఘకాలిక చర్చను అధికార కూటమి అంగీకరించకపోవటమే సమస్యగా మారింది. ఒకవైపు మణిపూర్ తగలబడిపోతున్నా దానిగురించి సభలో చర్చకు మోడీ అనుమతించకపోవటమే విచిత్రంగా ఉంది. మోడీని నిర్దేశించలేక, బాధ్యతలను గుర్తుచేయలేక చివరకు తమ అశక్తతను వ్యక్తంచేయటంతోనే ఎన్డీయే ఫెయిలైందని అర్ధమవుతోంది.

# ఎందుకంత నిరాసక్తత..!



ఖమ్మం : గతంలో సింగరేణిలో కొలువు అంటే ఎంతో ప్రియం. కష్టమైనా ఇబ్బందులను అధిగమిస్తూ ఇష్టంగా పనిచేసేవారు. అధిక వేతనాలకు తోడు కొలువుల విషయంలో బయట అవకాశాల లేమి ఇందుకు ప్రధాన కారణంగా ఉండేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారుతోంది. సింగరేణి కొలువుపై కొందరు ఉద్యోగుల్లో నిరాసక్తత అధికమైంది. విధుల్లో గైర్హాజరు అయ్యే వారి సంఖ్య క్రమేణా పెరుగుతుండటమే ఇందుకు నిదర్శనం. ప్రధానంగా యువతలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికి కనీసం వంద మస్టర్లు ఉద్యోగులు పూర్తి చేయాలి. కానీ వాటిని కూడా పూర్తి చేయకుండా సింగరేణి వ్యాప్తంగా గత ఉత్పాదక సంవత్సరం వెయ్యి మందికి పైగా ఉద్యోగులు విధులకు గైర్హాజరయ్యారు. ఈ తరహా పరిస్థితులతో ఉత్పత్తి లక్ష్య సాధన పూర్తి చేయటం యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. భూపాలపల్లి ఏరియాలో వంద మస్టర్లు పూర్తి చేయని 48మంది ఉద్యోగులను ఇటీవల యాజమాన్యం డిస్మిస్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని వేల మంది నిరుద్యోగులు నిత్యం సాధన చేస్తున్నారు. కానీ గనిలో ఉద్యోగం పొందిన కొందరు విధులకు గైర్హాజరవుతూ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకొంటున్నారు.

**పరివర్తన లేదు**

గైర్హాజరు అయ్యే వారు సక్రమంగా విధులు నిర్వర్తించేలా అధికారులు గనులవారీగా సదరు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినా చాలామందిలో ఎటువంటి మార్పు రావటం లేదు. చాలామేర కొరడా ఝుళిపించకుండా మానవీయ కోణంలో మార్పు కోసం ప్రయత్నిస్తుంది. గనుల వారిగా ఉన్న సంక్షేమ అధికారులు ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి విధులకు హాజరు కావాలని నచ్చజెబుతున్నారు. పూర్తి స్థాయి మస్టర్లు లేకుంటే ఉద్యోగికి, సింగరేణి కలిగే నష్టాన్ని వివరిస్తూ హాజరు శాతం పెరిగేలా కృషి చేస్తున్నారు.

**యువ ఉద్యోగులే ఎక్కువ**

గైర్హాజరు అయ్యే వారిలో యువ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారు. గత తొమ్మిదేళ్ల నుంచి వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన చాలామంది డిగ్రీ, బీటెక్, పీజీ వంటి ఉన్నత విద్య అభ్యసించిన వారై ఉంటున్నారు. వారికి తొలుత బదిలీ వర్కర్‌గా భూగర్భ గనుల్లో విధులు కేటాయిస్తున్నారు. ఒక్కసారిగా విధి నిర్వహణ వాతావరణం మారటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. మరికొంత మంది ప్రైవేటు కొలువులు నిర్వరిస్తూ సింగరేణిలో విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇంకొంత మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు.

విధులకు హాజరుకాని వారికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. వారిలో కొంత మార్పు ఉంటోంది. ఉద్యోగుల హాజరు శాతం పెరిగేలా ప్రయత్నిస్తున్నాం. గైర్హాజరుతో సింగరేణికి, ఉద్యోగికి నష్టం ఏర్పడుతుంది. అధికారులు సూచనలు పట్టించుకోకుండా విధులకు హాజరు కాని ఉద్యోగులపై చర్యలుంటాయి. దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు.

# నాలుగు దిశల్లో ముదింపు

కొత్తగూడెం : పట్టణాల్లో ఉత్పత్తవుతున్న వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం, వాహనాల ద్వారా తరలించడం, యంత్రాలను ఉపయోగించి పునర్వినియోగించడం.. ఇలా వ్యర్థాలకు అర్థం కల్పిస్తూ ఆదాయంగా మలుస్తున్నారు. పౌరుల భాగస్వామ్యంతో పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, ఆహ్లాద వాతావరణాన్ని కల్పిస్తున్న సంస్థలకు కేంద్రం ర్యాంకులు, అవార్డులు, నగదు ప్రోత్సహాకాన్ని అందజేస్తోంది. 2016 నుంచి కేంద్రం స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోంది. ఏటా కేంద్ర బృందాలు స్థానిక సంస్థల పనితీరును గుర్తిస్తున్నాయి. తాజాగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2023




టూల్‌కిట్‌ను దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి మనోజ్‌జోషి ఇటీవల విడుదల చేశారు. 2023లో ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్ రీసైకిల్ రీయూజ్)కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేల్లో మూడు దశలుండగా తాజాగా నాలుగు దశల్లో మదిస్తారు.

**ఈసారి ఆర్‌ఆర్‌ఆర్‌కే ప్రాధాన్యం**

స్వచ్ఛసర్వేక్షణ్ ఒక్కో ఏడాది ఒక్కో అంశాన్ని లక్ష్యంగా చేసుకుని పనులను నిర్దేశిస్తున్నారు. గతేడాది సామాజిక, బహిరంగ మరుగుదొడ్ల నిర్మాణం, తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం వంటి అంశాలను లక్ష్యంగా ఉంచారు. 2023లో వ్యర్థాలను పునర్వినియోగం చేసి ఆదాయాన్ని ఆర్జిస్తున్న పురపాలికలను గుర్తించనున్నారు. దీనినే ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్)గా పిలుస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

# వెనకబడితే టీసీ ఇచ్చేస్తారు!




ఖమ్మం : కూసుమంచి మండలానికి చెందిన దివ్యాంగురాలైన బాలిక, తండ్రిలేని మరో విద్యార్థిని.. కొణిజర్ల కేజీబీవీలో ఏడోతరగతి పూర్తిచేశారు. చదువులో వెనకబడ్డారనే సాకుతో వారి కుటుంబ సభ్యులను పిలిచి నాలుగు రోజుల క్రితం నిర్వాహకులు టీసీలు ఇచ్చారు. విద్యార్థులు బతిమిలాడినా కనికరించలేదు. తల్లిదండ్రుల్లేని పిల్లలు, చదువు మధ్యలో మానేసిన పేద విద్యార్థులే ఎక్కువ మంది కేజీబీవీల్లో చదువుతుంటారు. సాధారణంగా వీరు చదువులో కొంత వెనకబడి ఉంటారు. వీరిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే. కొణిజర్ల కేజీబీవీలో ఉత్తీర్ణత శాతం ఆశించిన స్థాయిలో లేదనే సాకుతో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఏటా టీసీ ఇచ్చి పంపిస్తుండటం గమనార్హం.

కొణిజర్ల మండలం బస్వాపురం సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం మొదటినుంచి వివాదాలకు నిలయంగా మారుతోంది. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 292 మంది విద్యార్థినులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర ఫిర్యాదులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మెనూ పూర్తిస్థాయిలో అందించకున్నా అమలుచేసినట్లు, పరాయి వ్యక్తులు పాఠశాలకు వచ్చి అధిక సమయం ఇక్కడే ఉంటారని అందులో సిబ్బంది నుంచే ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యాలయంలో సమావేశాలు, విధుల విషయంలో లోపభూయిష్ట నివేదికలు పంపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల కొందరు ఉపాధ్యాయులు తమ వద్దనున్న ఆధారాలతో కలెక్టర్‌ను కలిసేందుకు యత్నించగా అధికారులు సర్దిచెప్పారు.

విచారణ జరిపితే..కొణిజర్ల కేజీబీవీలో నిర్వాహకురాలు, ఉపాధ్యాయుల మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఇటీవల నిర్వాహకురాలు అక్కడ పనిచేసే అటెండర్‌పైకి బాటిల్ విసిరేయడం, ఆమెకు దెబ్బతగలడంతో వివాదాస్పదమైంది. ఉన్నతాధికారులు విషయాన్ని నాలుగు గోడల మధ్య రాజీచేసి మిన్నకున్నారు. ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి సక్రమంగా బోధించటం లేదనే ఆరోపణలున్నాయి. ఇంకోపక్క చదువులో విద్యార్థులు వెనకబడితే టీసీలు ఇచ్చి పంపిస్తున్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.పిల్లలకు టీసీలు ఇచ్చిన విషయం నా దృష్టికి రాలేదు. వివరాలు సేకరించి విచారణ చేపడతాం. అటెండర్‌తో గొడవ జరిగితే సర్దిచెప్పాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. శ్యాంసన్, ఎంఈఓ, కొణిజర్ల

# లారీలు రాక... కాంటాలు కాక

వేములవాడ : ఈ ధాన్యం బస్తా వద్ద కూర్చొన్న మహిళా రైతు పేరు కొంపల్లి లచ్చవ్వ. ఈమెది వేములవాడ గ్రామీణ మండలంలోని మల్లారం. ధాన్యం తీసుకొచ్చి వారం రోజులైంది. తేమ శాతం వచ్చినా లారీల కొరత కారణంగా కాంటా పెట్టలేదు. దీంతో రోజూ కుప్పను చూస్తూ ఇలా చెట్టు కింద కూర్చొంటుంది. లచ్చవ్వనే కాదు ఇలా చాలా మంది అన్నదాతలు ధాన్యం కాంటాలు కాక పడిగాపులు కాస్తున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా కేంద్రాల్లో లారీలు రాకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కాంటాలు పెట్టడం లేదు. దీంతో కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం కుప్పలు, కాంటాలైన బస్తాలు పేరుకుపోయాయి. పలు దఫాలుగా కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడిన రైతులకు రోజూ ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది.జిల్లాలో యాసంగిలో 1.18 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సింగిల్ విండోలు, ఐకేపీ, డీసీఎంఎస్, మెప్మా ద్వారా 265 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభమై దాదాపు 20 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తూకాలైన బస్తాలను మిల్లులకు తరలించడానికి అవసరమైన లారీలు, ఇతర వాహనాల కొరత కారణంగా చాలా కేంద్రాల్లో బస్తాలు పేరుకుపోతున్నాయి. మరోవైపు వర్షాల భయం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆందోళనకు గురిచేస్తోంది. తూకాలైన బస్తాలపై



టార్పాలిన్ కవర్లు కప్పి పెట్టారు. లారీలు వస్తే మిల్లులకు తరలించేందుకు ఎదురుచూస్తున్నారు. మరో వైపు కాంటాలు కాక రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు పడుతున్నారు.

వారం రోజులుగా నిరీక్షణ...లారీల కొరతతో కేంద్రాల్లో సకాలంలో ధాన్యం కాంటాలు కావడం లేదు. ఫలితంగా రైతులు తమ ధాన్యం కుప్పల వద్ద వారం రోజులుగా నిరీక్షిస్తున్నారు. చాలా చోట్ల రోజుల తరబడి కుప్పలు కాంటాలకు నోచుకోవడం లేదు. జిల్లాలో రోజూ 270 నుంచి 280 వరకు లారీల ధాన్యాన్ని తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రైసు మిల్లుల యజమానులు సకాలంలో లారీల నుంచి ధాన్యం బస్తాలను దింపుకోవడం లేదు. దీనివల్ల మిల్లుల వద్ద లారీలు నిలిచిపోయి ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంతో కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిల్వలు, కాంటాలైన బస్తాలు పేరుకుపోతున్నాయి. మిల్లుల్లో నిల్వలుండటంతో మిల్లుల యజమానులు ధాన్యం దింపుకునేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఒక్కొక్క కేంద్రంలో దాదాపు రెండు, మూడు లారీల ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నట్లు కర్షకులు పేర్కొంటున్నారు. ధాన్యం కాంటాలు పెడితే సమస్యలు ఎక్కువ అవుతుందని కేంద్రాల నిర్వాహకులు లారీల రాకను బట్టి తూకాలు వేస్తున్నారు. దీంతో రైతులు రోజుల తరబడి కుప్పల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది.

కొనుగోళ్ల వేగవంతానికి చర్యలు- హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల మేనేజరుధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సాధ్యమైనంత వరకు లారీల కొరత లేకుండా చూస్తున్నాం. జిల్లాలో ప్రతి రోజు 185 లారీల్లో ధాన్యం లోడ్ చేసి మిల్లులకు తరలిస్తున్నాం. లారీలతో పాటు డీసీఎం వ్యాన్లు, ట్రాక్టర్లను ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ చర్యలు తీసుకుంటున్నాం.

# రామాలయ పాలన గాడిన పడేనా..!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గత ఏడాది రూ.40 కోట్ల వార్షిక బడ్జెట్ అమలు చేశారు. 2023-24లో రూ.44 కోట్లు ఉంటుందని అంచనా. ఏడాదికి 30 లక్షల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్నారు. నవమి ఉత్సవాలకు సందర్భంగా మొత్తంగా రూ.4 కోట్ల ఆదాయం సమకూరింది. ఖర్చులు పోను కొంత మిగులుతుందని అంచనా వేశారు. ఆలయానికి ఆదాయ వనరులున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదు. అడిగేందుకు ధర్మకర్తల మండలి లేదు. సమస్యల పరిష్కారానికి అధికారులే చొరవ తీసుకోవాల్సి ఉంది. నూతనంగా ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవి ఇటీవల పాలనాపరమైన అంశాల్లో కొంత దూకుడు ప్రదర్శిస్తున్నారు. అంతర్గత బదిలీలు చేసి తనిఖీ బృందాలను ప్రకటించారు.

**కనీస సౌకర్యమైనా లేకపాయె..!**

భక్తులకు సరైన సదుపాయాల కొరవడ్డాయి. అందుబాటులో మరుగుదొడ్లు లేకపోవడంతో గంటల తరబడి ఉగ్గపట్టి ఉండాల్సి వస్తోంది. కల్యాణకట్ట సమీపంలోని ఖాళీ ప్రదేశంలో వీటిని నిర్మించాలనే ప్రతిపాదనలు కార్యరూపు దాల్చలేదు. ఆలయ సిబ్బంది అవసరాలకు వీఐపీ మార్గంలోని పాత వాహనశాలలో మరుగుదొడ్లు ఉన్నాయి. స్టేడియం వద్ద కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో భక్తులకు అవస్థలు తప్పటం లేదు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో తాగునీటి సమస్య కొంతమేర తగ్గింది.

**భవిష్యత్తు అవసరాలను గుర్తించాలి**

కేంద్ర ప్రభుత్వం 6 రాష్ట్రాల్లోని 11 ప్రాంతాలను కలుపుతు రామాయణ వలయం రైలు నడుపుతున్నారు. ఇందులో భద్రాచలానికి ప్రాధాన్యం ఉన్నందున రానున్న రోజుల్లో యాత్రికుల తాకిడి తప్పదు. రాష్ట్రపతి ముర్ము ఇటీవల ఇక్కడకు పర్యాటక పనులకు శంకుస్థాపన చేశారు. ఇవి పూర్తయితే టూరిజానికి కొత్తందాలు సమకూరుతాయి. ఇప్పుడున్న



వసతి సదుపాయం రానున్న రోజుల్లో సరిపోదు. కొన్ని కుటీరాలు పూర్తిగా దెబ్బతినడంతో వాడడం మానేశారు. పూర్తయినవాటిని స్వాధీనం చేసుకోకుండా తాత్సారం చేస్తున్నారు.

**ఉద్యోగుల సంగతేంటి..**

నెల క్రితం ఓ ఉప ప్రధానార్చకుని ఉద్యోగ విరమణతో సీనియర్ ముఖ్య అర్చకుడు మురళీకృష్ణమాచార్యులుకు ఉద్యోగోన్నతి కల్పిస్తున్నారు. వచ్చే నెల మరో ముఖ్య అర్చకుడు, ఇద్దరు వాద్య విద్వాంసులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ ఖాళీలను భర్తీ చేసే చర్యలు అవసరం. ఓ అర్చకుడు ఏడాది నుంచి సెలవుల్లో ఉన్నారు. ఇంకో ఉద్యోగి ప్రత్యేక కారణాలతో విధులు మానేసి ఇటీవల వచ్చారు. తిరిగి విధుల్లో చేరేందుకు కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి అంశాలపైనా దృష్టి సారిస్తేనే సిబ్బంది కొరతను నియంత్రించే వీలుంటుంది.

# రుణమాఫీ.. అన్నదాతలు ఖుషి!!

వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం 2018 ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీ అమలు కానుంది. ఇప్పటి వరకు రూ.36 వేల వరకు మాత్రమే మాఫీ అయింది. రూ.50 వేలు, అంతకంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు మూడేళ్ల నుంచి నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది.

పట్టరాని ఆనందం.. పొలంలోనే సంబరం

రూ.లక్ష రుణమాఫీ ప్రకటించినందుకు సంతోషంగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో వరి నాటు వేయడానికి సిద్ధం చేసిన బురద పొలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

అమలు కాని ప్రణాళికలు..

2018 డిసెంబరు 11వ తేదీ నాటికి పంటరుణాల బకాయిలు రూ.లక్షలోపు వరకు మాఫీ చేయనున్నట్లు 2020 మార్చిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో రూ.25 వేల లోపు మాత్రమే మాఫీ చేశారు. రెండో విడతలో రూ.50 వేల వరకు చేసేందుకు



చర్యలు చేపట్టినా రూ.36 వేల వరకు మాత్రమే అయింది. మిగతా వారు ఎదురుచూస్తున్నారు. రూ.50 వేల లోపు తీసుకున్న వారికి సంబంధించి రుణాలను 2021 ఆగస్టు 16 నుంచి 31 వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. మూడో విడతలో రూ.75 వేల వరకు, నాలుగో విడతలో రూ.లక్ష వరకు మాఫీ చేయాలని ప్రణాళికలు రూపొందించినా అమలు కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతూ వచ్చారు.

ఉమ్మడి జిల్లా డీసీసీబీలో..

ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని 70 ప్రాథమిక సహకార సంఘాల్లో సభ్యులైన 43,434 మంది రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ అవుతుంది. మొదటి విడతలో 11,430 మందికి రూ.25 వేల చొప్పున రూ.6.49 కోట్లు, రెండో విడతలో 4,462 మందికి రూ.36 వేల చొప్పున రూ.16.50 కోట్లు మాఫీ చేశారు. ప్రస్తుతం 27,542 మంది రైతులకు రూ.37 వేల నుంచి రూ.లక్ష వరకు మొత్తం రూ.220.96 కోట్లు మాఫీ చేయనున్నారు.

వివరాలు సేకరిస్తున్న బ్యాంకులు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కమర్షియల్ బ్యాంకుల ద్వారా రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతుల వివరాలు ఆరు జిల్లాల పరిధిలోని లీడ్ బ్యాంకు మేనేజర్లు, జిల్లాల వ్యవసాయ శాఖల అధికారులు వద్ద లేకపోవడం గమనార్హం. సర్కారు నుంచి పేర్లు వస్తాయి.. అనే సమాధానం చెప్పడం విస్మయం కలిగిస్తోంది. రైతుల వివరాలే బ్యాంకు వద్ద లేనప్పుడు రుణమాఫీ ఎవరికి చేస్తానేది ప్రశ్న?గా ఉంది. ప్రభుత్వ ప్రకటన వెలువడిన దరిమిలా వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

# నిరీక్షించినా నిరాశే!

జమ్మికుంట: ఈ పరిస్థితి రాజయ్య ఒక్కరిదే కాదు.. 2021-22 సీజన్ విక్రయాల సమయంలో ధరలు బాగా పెరగడంతో 2022-23 సీజన్‌లోనూ భారీగా ధరలు పెరుగుతాయని ఆశించి చాలా మంది రైతులు ఇళ్లలో పత్తిని నిల్వ చేశారు. ఎంతకూ ధరలు పెరిగే పరిస్థితి కనిపించకపోవడం.. ప్రస్తుతం సాగుకు డబ్బులు అవసరమవడంతో మార్కెట్‌కు తెచ్చి విక్రయించడం ప్రారంభించారు. దీంతో జమ్మికుంట మార్కెట్‌లో నాలుగు రోజులుగా రోజూ 40 నుంచి 20 ట్రాలీల విడిపత్తి విక్రయాలు జరుగుతున్నాయి.

2021- 22 సీజన్‌లో 2021 నవంబరులో జమ్మికుంట మార్కెట్‌లో పత్తి ధర క్వింటా రూ.14 వేలు గరిష్ఠ ధర పలికింది. 2022-23 సీజన్ విక్రయాలు గతేడాది అక్టోబర్ నుంచి ప్రారంభం కాగా గరిష్ఠ



ధర రూ.9,500 మాత్రమే పలికింది. దీంతో ధర పెరుగుతుందేమోనని రైతులు ఆశగా ఉండగా తాజాగా రూ.7,300కు చేరింది.

విక్రయాల సీజన్ ఆరంభంలో వరంగల్, పెద్దపల్లి మార్కెట్ల కంటే జమ్మికుంటలో అధిక ధర పలకటంతో జయశంకర్ భూపాల్‌పల్లి, వరంగల్, పెద్దపల్లి, హన్మకొండ జిల్లాలకు చెందిన పలువురు రైతులు ఇక్కడికి పత్తి తెచ్చి విక్రయించారు. మొదట్లో రోజుకు 250 ట్రాలీల దాకా విడిపత్తి విక్రయాలు జరిగాయి.

ధరల పతనంతో పత్తి విక్రయాలు నాలుగు రోజుల కిందటి వరకు బాగా తగ్గాయి. ఇటీవలి వరకు రోజూ 2 నుంచి 10 నుంచి ట్రాలీల పత్తి మాత్రమే విక్రయానికి వచ్చింది. నాలుగు రోజులుగా మాత్రం మళ్లీ పరిస్థితి మారుతోంది. మార్కెట్‌కు రోజూ 20 నుంచి 40 ట్రాలీల పత్తి విక్రయానికి వస్తోంది. సీజన్ ముగింపు దశకు చేరటంతో ధర పెరుగుదలపై ఆశలు వదులుకున్న రైతులు పత్తిని విక్రయానికి తీసుకొస్తున్నారు.

నిరీక్షించి నష్టపోయా : వీణవంక మండలం మామిడాలపల్లికి చెందిన ఈ రైతు పేరు ఎనగంటి రాజయ్య పత్తి క్వింటాలు రూ.9 వేలు పలికినప్పుడూ విక్రయించలే. ఇంకా పెరుగుతుందని ఆశలో ఉండిపోయి ఇంట్లో నిల్వ చేశారు. ఫలితం లేకపోవడంతో ప్రస్తుతం సాగు పెట్టుబడులకు డబ్బు అవసరమై రూ.7,100కు క్వింటాలు చొప్పున విక్రయించారు. పెట్టుబడుల కోసం విధి లేక తక్కువ ధరైనా విక్రయించా అని వాపోతున్నారు.

ఫలితం లేదని విక్రయిస్తున్నారు : ధర కోసం నెలల తరబడి నిరీక్షించిన రైతులు ఇక ధర పెరుగదని నిర్ధారణ చేసుకొని పత్తిని విక్రయానికి తీసుకు వస్తున్నారు. నాలుగు రోజుల కిందట వరకు చాలా తక్కువగా వచ్చేది. ప్రస్తుతం 40 ట్రాలీల వరకు విక్రయానికి వస్తోంది. ఇప్పటికీ ఇతర మార్కెట్ల కంటే జమ్మికుంటలో అధిక ధర పలుకుతుండటంతో ఇతర జిల్లాల రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. జి.రెడ్డినాయక్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

# బడి.. పర్యవేక్షణ కొరవడి!



వరంగల్ : జిల్లాలో విద్యా వ్యవస్థపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో పాఠశాలలను తనిఖీ చేసే దిక్కులేకుండా పోతోంది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకుండా అడిగేవారు లేరు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పట్టించుకొనే దిక్కులేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు కావస్తోంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందలేదు. వాటిని తెప్పించే రెగ్యులర్ మండల విద్యాధికారులు లేరు. పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉండి విద్యార్థులు నష్టపోతున్నా వాటిని గుర్తించి సర్దుబాటు చేసే పరిస్థితి లేదు.

అంతా సీనియర్ ప్రధానోపాధ్యాయులే..: జిల్లాలో 13 మండలాలు ఉన్నాయి. ఒక్కచోట కూడా రెగ్యులర్ ఎంఈవో లేరు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. సంగెం మండలం గవిచర్ల జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.విజయ్‌కుమార్‌కు వరంగల్, ఖిలా వరంగల్, సంగెం మండలాల బాధ్యతలు అప్పగించారు. పర్వతగిరి మండలం వడ్లకొండలోని జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సీహెచ్.సత్యనారాణయ గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి మండలాల బాధ్యతలు చూస్తున్నారు. నెక్కొండ మండలం రెడ్లవాడలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల నెక్కొండ, చెన్నారావుపేట, నర్సంపేట, ఖానాపూర్ ఇన్‌ఛార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. రాయపర్తి మండలం కొండూర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎన్.రంగయ్యకు వర్ధన్నపేట, రాయపర్తి మండలాల బాధ్యతలు ఇచ్చారు. వారు ఇటు పాఠశాలల్లో పాలనా బాధ్యతలు.. అటు మండలాల్లో పర్యవేక్షణ చేయలేక సతమతం అవుతున్నారు.

'పది' ఫలితాలపై ప్రభావం.. పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడంతో దాని ప్రభావం పదో తరగతి పరీక్ష ఫలితాలపై పడుతోంది. మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సరిగా వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తనిఖీలు చేసి విద్యా వ్యవస్థలను గాడిన పెట్టాల్సిన ఎంఈవోలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక పదో తరగతి విద్యార్థులు నష్టపోతున్నా ప్రత్యామ్నాయ చర్యలు లేవు. రెగ్యులర్ ఎంఈవోలే కాదు.. జిల్లాలో చాలా చోట్ల రెగ్యులర్ ప్రధానోపాధ్యాయ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..

జిల్లాలో రెగ్యులర్ ఎంఈవోలు ఒక్కరు కూడా లేనిది వాస్తవమే. ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలల్లోని క్రమశిక్షణ కలిగిన సీనియర్ ప్రధానోధ్యాయులకు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించాం. ప్రస్తుతం వారితోనే పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతి మండలానికి విద్యాశాఖ అధికారి ఉంటే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుంది. డి.వాసంతి, డీఈవో

# రైల్వే స్టేషన్లకు విమానాశ్రయ హంగులు



వరంగల్ : కేంద్రం ప్రకటించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేట, జనగామ, మహబూబాబాద్ రైల్వే స్టేషన్లను విమానాశ్రయాల తరహాలో అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణలో 39 రైల్వే స్టేషన్లు ఎంపిక కాగా ఉమ్మడి వరంగల్ నుంచి మూడు ఉన్నాయి. వీటికి రూ.88.7 కోట్లను కేటాయించారు. ఈ నెల 6న ఉదయం 9 గంటలకు వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఎలా అభివృద్ధి చేస్తారంటే..

రైల్వే స్టేషన్ల ముందు ఉన్న స్థలం మొత్తం సుందరీకరణ, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఐలాండ్‌లను నిర్మిస్తారు. కారులో వచ్చే వారు నేరుగా రైల్వే స్టేషన్ ప్లాటుఫారం ముందు దిగే విధంగా (ఎయిర్‌పోర్టు మాదిరి) ప్రణాళికలను రూపొందిస్తున్నారు. స్టేషన్ భవనాల రూపును పూర్తిగా మార్చేస్తారు. ప్రస్తుతం జనగామ, మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లు పాతకాలం భవనాల్లా ఉంటాయి. ప్రాంగణం కూడా తక్కువ స్థలంలో ఉంది. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ముందు భాగం మరీ ఇరుకుగా ఉంది. దీనికి పక్కనే ఉన్న రైల్వే క్వార్టర్ల స్థలాన్ని కూడా కలుపుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కాజీపేట రైల్వే స్టేషన్ ముందు చాలినంత స్థలం ఉంది. స్టేషన్ ముందు భాగాన పెద్ద ఐలాండ్ ఏర్పాటు చేయడానికి పక్కనే ఉన్న జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్ భవనాలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో ఒకే భవనాన్ని నిర్మించి అందులో పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్ రోడ్‌ను మరింత విశాలం చేయడానికి కూడా రైల్వే సంబంధిత విభాగాలను తరలించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆధునిక సదుపాయాలు..ప్రయాణికుల కోసం కూడా ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తారు. టికెట్ తీసుకునే విధానాన్ని ఆధునికీకరించి స్టేషన్‌లో ఎక్కడ నుంచైనా మొబైల్ ద్వారా లేదా ఆటోమేటిక్ టెల్లర్ యంత్రాల ద్వారా టికెట్ తీసుకునే సదుపాయం కల్పిస్తారు. స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద ఎస్కలేటర్, లిఫ్టులను ఏర్పాటు చేస్తారు. సామానులను స్కానింగ్ చేసే యంత్రాలు ఉంటాయి. ప్రయాణికులకు సహాయ కేంద్రాలను అందుబాటులోకి తెస్తారు. స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు 'వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్' దుకాణాలకు చోటు కల్పిస్తారు.

స్టేషన్లకు ఇరువైపులా ఉన్న పట్టణ ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు ప్రాధాన్యమిస్తారు.

విశ్రాంతి గదులకు ప్రాధాన్యం

ప్రయాణికుల విశ్రాంతి కోసం అమృత్ రైల్వే స్టేషన్‌లలో ప్రాధాన్యమిస్తున్నారు. ఇప్పుడు ఉన్న విశ్రాంతి గదులను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో అందరూ ఒకే దగ్గర ఉండే విధంగా ఒకే పెద్ద హాలును నిర్మించి సదుపాయాలను ఒకే చోట కేంద్రీకరిస్తారు. ప్రముఖులు వేచి ఉండటానికి కూడా ప్రత్యేక లాంజ్‌లను ఏర్పాటు చేస్తారు. రెండో ప్లాటుఫారం మీద కూడా ప్రయాణికులు వేచి ఉండటానికి సదుపాయాలు కల్పిస్తారు. ఆర్వోఆర్ తాగునీటిని కుళాయిల ద్వారా అందిస్తారు.

# రోడ్డు బాగుకు ఊరంతా కదిలింది..

వరంగల్ : ఎవరో వచ్చి ఏదో చేస్తారని చూడకుండా ఆ గ్రామస్థులంతా ఒక్కటయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న రహదారిని ఊరంతా కలిసి బాగుచేసుకుని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. ములుగు మండల పరిధిలోని ఓ మారుమూలన బొగ్గులవాగు అవతలివైపున అంకన్నగూడెం అనే గిరిజన గ్రామం ఉంది. ఆ గ్రామంలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల ఉధృతికి గ్రామానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది.లక్నవరం చెరువుకు ప్రధాన ఆధారం ములుగు నుంచి అంకన్నగూడెం వెళ్లాలంటే సర్వాపురం-అంకన్నగూడెం గ్రామాల మధ్యలో బొగ్గుల వాగు ప్రవహిస్తుంది. ఈ వాగు పర్యాటక ప్రాంతమైన లక్నవరం చెరువుకు ప్రధాన ఆధారం. దీని ద్వారా వచ్చిన వరదతోనే లక్నవరం చెరువు నిండుతుంది. వాగు ప్రవహించకపోతే లక్నవరం జలాశయంలో నీళ్లుండవు. వర్షాల సమయంలో వాగు ప్రవాహం తీవ్రంగా ఉంటుంది.

నాలుగు రోజులుగా నిలిచిన రాకపోకలు

అంకన్నగూడెం గ్రామస్థులు బొగ్గులవాగు అవతలిపైపు వెళ్లడానికి వాగుపై తక్కువ వెడల్పుతో ఓ వంతెన నిర్మించారు. వంతెన బాగానే ఉన్నా.. అవతలివైపు గ్రామానికి వెళ్లే దారిలో తారు రోడ్డు కొంత భాగం కొట్టుకుపోవడంతో పాటు రోడ్డుపై పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వీరంతా వాగు దాటి సర్వాపురంతో పాటు మండల కేంద్రానికి నిత్యం వారి అవసరాల కోసం వస్తుంటారు. రోడ్డు తెగిపోవడంతో.. నాలుగు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.సైన్యంలా ముందుకు..వాగు ప్రవాహానికి కోతకు గురై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలను పునరుద్ధరించాల్సిన ఐటీడీఏ అధికారులు కనీసం గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. నాలుగు రోజులుగా రవాణా సౌకర్యం కోల్పోయి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల కోసం ఎదురు చూశారు. ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది. లాభం లేదనుకుని ఊరంతా కలిసికట్టుగా సైన్యంలా ముందుకు కదిలింది. తొలుత శ్రమదానం చేసి రాళ్లను గుంతల్లో నింపారు. ట్రాక్టర్, డోజర్‌ను సమకూర్చుకుని కోతకు గురైన రోడ్డును బాగు చేసుకుని రాకపోకలను పునరుద్ధరించుకున్నారు.

# పారిశ్రామిక వాడలు.. సమస్యలకు నిలయాలు

కరీంనగర్ : ఒక ప్రాంతం ఆర్థికంగా బలపడాలంటే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలి. ఒక పరిశ్రమ నెలకొల్పితే అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించడంతోపాటు ఆ ప్రాంతం ప్రగతి పథంలో దూసుకెళ్తుంది. అలాంటిది పారిశ్రామికవాడల్లో సరైన సౌకర్యాలు లేక పరిశ్రమల యజమానులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. రూ.లక్షల్లో పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. జిల్లాలోని పారిశ్రామికవాడల దుస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

పన్నులు చెల్లిస్తున్నా..

జిల్లాలో రెండు పారిశ్రామిక వాడలు ఉన్నాయి. పద్మనగర్ ఇండస్ట్రీయల్ పార్క్, రెండోది ఆటోనగర్. రెండింటిలో 205 యూనిట్లు ఉన్నాయి. పద్మనగర్‌లో విత్తనశుద్ధి, బ్రెడ్ తయారీ, రైస్ మిల్లు, తదితర పరిశ్రమలు ఉండగా, ఆటోనగర్‌లో ఆటోమొబైల్, మరమ్మతు యూనిట్లు ఉన్నాయి. పద్మనగర్ పారిశ్రామిక వాడ సమస్యలకు నిలయంగా మారింది. మురుగునీటి కాల్వలు శిథిలావస్థకు చేరాయి. వర్షం పడితే నీరంతా రోడ్లపైకి చేరుతుంది. వీధి దీపాలు వెలగడం లేదు. 2019లో మౌలిక వసతుల కల్పనకు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో కొంతమేర సీసీ రోడ్లు వేసి వదిలిపెట్టారు. ఏటా పరిశ్రమల నుంచి లక్షలాది రూపాయల పన్నులు వసూలు అవుతున్నా సమస్యలు పరిష్కరించడంలేదు. ఆటోనగర్‌లో కూడా సమస్యలు తిష్ఠ వేశాయి.




రహదారులు, మురుగుకాల్వలు, వీధి దీపాలు లేక ఇబ్బందిగా మారింది. గతంలో రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు విడుదల చేసినా అవి సరిపోలేదని అంటున్నారు.

అసంపూర్తిగా భగీరథ పైపులైన్..

పద్మనగర్ పారిశ్రామికవాడ పక్కనే ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నా కనీసం నీటి వసతి లేదు. ట్యాంక్ వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ పారిశ్రామికవాడ యజమానులు అప్పటి మేయర్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి విన్నవించారు. త్వరలోనే తాగునీటిని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలుకాలేదు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తామని పైపులైన్ వేసి వదిలేశారు.


మందుబాబులకు అడ్డాగా...పద్మనగర్ పారిశ్రామికవాడ మందుబాబులకు, డ్రైవింగ్ స్కూళ్ల వారికి అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు ఆ ప్రాంతంలో మందుబాబులు సంచరిస్తుంటారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, స్థానికులు రాత్రి పూట బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు పలు డ్రైవింగ్ స్కూళ్లు కారు చోదక శిక్షణను ఇక్కడే ఇస్తున్నాయి.ఏళ్లు గడుస్తున్నా నీటి సౌకర్యం లేదు..- సంఘయ్య, పరిశ్రమ యజమాని

పద్మనగర్ పారిశ్రామికవాడలో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. ఈ విషయంపై అప్పటి మేయర్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి విన్నవించాం. నీటి సమస్య తీర్చుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ నెరవేరలేదు.మురుగు కాల్వలు లేవు..- రాగుల రామస్వామి గౌడ్, పరిశ్రమ యజమానిపారిశ్రామికవాడలో సరైన రహదారులు లేవు. మురుగునీటి కాల్వలు శిథిలావస్థకు చేరాయి. పరిశ్రమల నుంచి వచ్చే మురుగు నిలిచిపోతుంది. వాసన, దోమల బెడద వేధిస్తోంది. మందుబాబులు, ఇతర వాహనాలు రాకుండా గేట్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.. -స్వామి, జోనల్ మేనేజర్, టీఎస్‌ఐఐసీ కరీంనగర్పారిశ్రామికవాడల్లో పరిశ్రమల యజమానులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వీధి దీపాలు పోయిన చోట కొత్తవి బిగిస్తున్నాం. రోడ్లపై చెత్తను తొలగించడానికి చర్యలు చేపట్టాం. మిషన్ భగీరథ ద్వారా నీరు అందించడానికి పైప్‌లైన్ వేశాం.

# వాన నీటి సంరక్షణే అత్యంత కీలకం

జగిత్యాల : అధికవర్షం కురిసిన సందర్భాల్లో వరదతో ఇబ్బందులు తలెత్తినా ఏడాది పొడవునా అన్నింటికీ ఆధారమైన వర్షపునీటి సంరక్షణ, వినియోగం అత్యంత ఆవశ్యంగా మారింది. వ్యవసాయాధారిత జిల్లాలో వర్షపునీటికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఈ వానాకాలంలో జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 455.1 మి.మీ ఉండగా 650.9 మి.మీ వర్షం కురిసింది. సాలీనా కురవాల్సిన వర్షంలో 60 శాతం వర్షం ఇప్పటికే కురవగా నీటి వనరులు నిండగా మిగిలిన జలాలు వృథాగా దిగువకు పారాయి. జిల్లాలోని 4.33 లక్షల ఎకరాల సాగులో 2.42 లక్షల ఎకరాల పైర్లకు వర్షపునీటితో ఉబికివచ్చే భూగర్భ



జలాలే ప్రధాన నీటివనరుగా ఉండటం వాననీటి ప్రాధాన్యతను కళ్లకు కడుతోంది.ఒక ఏడాదిలో సరాసరిగా 85-103 గంటల వాన మాత్రమే కురుస్తుండగా ఈ వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని ఏడాది పొడవునా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి వర్షపునీటి వినియోగం 10-17 శాతం మాత్రమేకాగా ఇది మరో 12 శాతం పెంచగలిగితే సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని నిపుణుల అంచనా. వర్షపాతంలో దాదాపు 40-51 శాతం వరకు భూమిలోకి ఇంకకుండా పొలంబయటకు వృథాగా పోతోంది. వర్షపునీటితో నేల పైపొరల్లో విలువైన పోషకాలతో కూడిన మట్టి కొట్టుకుపోతుంది. దీనికిగాను ప్రతి పొలంలోనూ లోతట్టులో నీటినిల్వ కందకాలను తవ్వాలి. పండ్లతోటల్లో, వాలుకు అడ్డంగాదున్ని కాంటూరు సేద్యాన్ని అనుసరించాలి, తోటల్లో వాలుకు అడ్డంగా మట్టికట్టల ద్వారా వర్షపునీరు నిల్వఉండి నేలలోనే ఇంకేలా చేయవచ్చు.

వ్యవసాయ బావులను రీఛార్జ్‌చేసేలా బావికి సమీపంలో గుంతనుతవ్వి వృథానీటిని ఇందులోకి మళ్లించాలి. ఇళ్లలో ఇంకుడు గుంతలను సమర్థంగా నిర్వహించాలి, అటవీ ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా ఉపాధిహామీ ద్వారా కాంటూరు కందకాలను పెద్దఎత్తున తవ్వి వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయటం సత్ఫలితాలను ఇస్తోంది. జిల్లాలో 1,096 చెరువులుండగా అన్నింటిలోనూ పూర్తిస్థాయిలో వర్షపునీటిని నిల్వ చేయాలి. వ్యవసాయంలో నీటివినియోగ సామర్థ్యం 20-43 శాతం ఉండగా బిందు, తుంపర్ల సేద్యంతో 69-93 శాతం వరకు పెంచేవీలుండగా ఈ పరికరాలను రాయితీపై ఇవ్వాలి. మన తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే కాబట్టి వినియోగ సామర్థ్యాన్ని పెంచాల్సిఉంది. ఎస్సారెస్పీలోనూ నీటినిల్వను 112 టీఎంసీలకు పెంచాలి.

# వసతులు మెచ్చేలా.. చదువులు నచ్చేలా..

ఖమ్మం : ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల(స్వయం ప్రతిపత్తి)కి న్యాక్ ఏం౦ గ్రేడ్ గుర్తింపు లభించింది. ఏడు అంశాల్లో క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ) 3.64 సాధించటం ద్వారా ఈ ఖ్యాతి దక్కింది. ఈమేరకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. ఇప్పటివరకు ఈ కళాశాలకు న్యాక్ బీం౦ గుర్తింపు మాత్రమే ఉంది. పరిశీలించిన ఏడు అంశాల్లోనూ పరిస్థితులు మెరుగుపడటంతో కళాశాలకు అరుదైన గుర్తింపు లభించింది. దీనిద్వారా కళాశాలకు భారీగా నిధులు మంజూరయ్యే అవకాశముంది. గతంలో ఐదేళ్లకు రూ.5 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరవగా ఈసారి గణనీయంగా పెరగొచ్చు.

పునాది వేసిన 'గెంటేల'

శ్రీరామభక్త గెంటేల నారాయణరావు విరాళంతో కొన్న 70 ఎకరాల స్థలంలో 1956లో కళాశాల ఏర్పాటైంది. 2015-16లో స్వయంప్రతిపత్తి పొందింది. ఖమ్మం, భద్రాద్రి, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు చెందిన 4,000 మంది విద్యార్థులు ఈ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ అభ్యసిస్తున్నారు. 800 మంది పీజీ చదువుతున్నారు. 54 గ్రూపులు కలిగిన కళాశాల.. అతిపెద్ద ప్రాంగణం, విశాలమైన తరగతి గదులు, డిజిటల్ విద్యాబోధన, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి నిలయంగా మారింది. 104 మంది అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రతిపాదిత అంశాలు

పాఠ్యప్రణాళిక: సిలబస్ నాణ్యత, మార్పులు, సమకాలీన అంశాలు, సర్టిఫికెట్ కోర్సులు, విద్యార్థి స్టడీ ప్రాజెక్టులు, విద్యార్థులు, తల్లిదండ్రుల



నుంచి సిలబస్‌పై అభిప్రాయాలు.

బోధనాభ్యసనం- మూల్యాంకనం: విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల నాణ్యత, బోధనానుభవం, విద్యార్థి- అధ్యాపక నిష్పత్తి, మూల్యాంకన పద్ధతులు, పరీక్ష విభాగం పనితీరు.

పరిశోధన- సౌకర్యాలు: పరిశోధనల నిమిత్తం అధ్యాపకులు, విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు- నాణ్యత, ప్రమాణాల పనితీరు.

భౌతిక- అభ్యసన సౌకర్యాలు: తరగతి గదులు, సాంకేతిక వినియోగం, క్రీడలు, సాంస్కృతిక సౌకర్యాలు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్, వాటిపై చేసిన ఖర్చులు.

విద్యార్థి సహకార అంశాలు- కొనసాగింపు: విద్యార్థి ఉపకార వేతనాలు, ఇతర ఆర్థిక చేయూత, ఫిర్యాదులు, పరిష్కార యంత్రాంగం, ప్లేస్‌మెంట్స్, ఉన్నత విద్య, విద్యార్థి కౌన్సిల్- పనితీరు, కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం.

పరిపాలన- నాయకత్వం: వివిధ పరిపాలన విభాగాలు- పనితీరు, విద్యార్థి, అధ్యాపకులకు గవర్నర్స్ నుంచి అందే శిక్షణ, ఐక్యూఏసీ- పనితీరు.

కళాశాల పాటించే విలువలు- ఉత్తమ విధానాలు: వాతావరణం, ప్రకృతి పరిరక్షణకు కళాశాల పాటించే విధానాలు, దివ్యాంగ విద్యార్థులకు సౌకర్యాలు, కళాశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి అనుసరించే ప్రత్యేకమైన పద్ధతులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, టీఎస్‌కేసీ/టాస్క్ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థుల నైపుణ్యాల పరిశీలన.

ఉత్తమ గ్రేడ్ సాధించటం ద్వారా గురుతర బాధ్యత పెరిగింది. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శుభాకాంక్షలు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారా కళాశాలను మరింత అభివృద్ధి పరుస్తాం. డాక్టర్ హమ్మద్ జకీరుల్లా, ప్రిన్సిపల్ ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల

# హరితహారం లక్ష్యం దిశగా అడుగులు

జనగామ : జిల్లాలో అమలవుతున్న 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం లక్ష్యం దిశగా సాగుతోంది. తొమ్మిదో విడత హరితహారాన్ని విజయవంతం చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు వారి లక్ష్యం మేరకు కృషి చేస్తున్నాయి. జిల్లా, మండల, క్లస్టర్, గ్రామస్థాయి అధికారులు మొక్కలు నాటే పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో సుమారు 64 శాతం మేర మొక్కలు నాటే పనులు పూర్తి కాగా.. మిగతాది పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు నిరంతరం మండలాలు, గ్రామాల్లో పర్యటిస్తున్నారు. అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

సాధారణంగా అటవీ విస్తీర్ణం 33 శాతం మేర ఉండాలి. జిల్లాలో ఒక శాతం మాత్రమే అటవీ ప్రాంతం ఉంది. ఇలాంటి ప్రాంతాల్లోనూ సాధారణ స్థాయికి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణలో భాగంగానే 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదట గ్రామ నర్సరీలు ప్రైవేటు స్థలాల్లో ఉండగా.. ప్రభుత్వ స్థలాల్లో నెలకొల్పడంతో పాటు నాలుగు నెలలు ముందుగానే మొక్కలను పెంచేందుకు నిరంతర కార్యాచరణను అమలు చేస్తోంది. ప్రతి గ్రామానికి 10 వేల నుంచి 40 వేల వరకు మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఒక నర్సరీని నిర్వహిస్తోంది. హరితహారం కార్యక్రమం మొదట జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా అమలయ్యేది. కాలక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేశారు.

వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తాం

జిల్లాలో తెలంగాణకు హరితహారం కార్యక్రమం వేగంగా సాగుతోంది. ప్రభుత్వ శాఖలన్నీ ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాయి. ప్రస్తుతం అనుకూల వాతావరణం ఉండటంతో మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. లక్ష్యం తక్కువగా ఉన్న శాఖలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాయి. ఇప్పటి వరకు 64 శాతం లక్ష్యం పూర్తి కాగా మిగతాది పూర్తి చేస్తాం.గూడూరు రాంరెడ్డి, డీఆర్డీవో

# క్రమ శిక్షణ.. దేశరక్షణ



సత్తుపల్లి : బాల్యదశలోనే క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ దేశభక్తి నింపుతోంది. సాయుధ దళాలపట్ల యువతకు మక్కువ ఏర్పడేలా శారీరక దృఢత్వం పెంపొందిస్తోంది. పాఠశాల నుంచి కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి ఉన్నత విద్యాభ్యాసంలోనూ విద్యార్థులకు అండగా నిలుస్తోంది నేషనల్ క్యాడెట్ క్రాప్స్(ఎన్‌సీసీ) శిక్షణ. వృత్తిగత జీవితంలో ఉన్నత స్థితికి ఎదగడం కోసం, అత్యున్నత శిఖరాలను అధిరోహించడానికి దోహదపడుతోంది. మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే అత్యుత్తమ కోర్సుల్లో ఒకటైన ఈ శిక్షణపై అనేక మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో క్యాడెట్ల ఎంపిక ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో ఎన్‌సీసీ శిక్షణ విశిష్టతపై కథనం..

మూడు ప్రభుత్వ పాఠశాలలకు అనుమతి

ఉమ్మడి జిల్లాలో మూడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు అవకాశముంది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో 50 మంది విద్యార్థులు కోర్సుకు ఎంపికయ్యారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని ఆనందఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చుంచుపల్లి ఉన్నత పాఠశాలల్లో 200 మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్లుగా శిక్షణ పొందుతున్నారు. ఇవి గాక పలు ప్రైవేటు పాఠశాలలు కూడా అనుమతి పొందాయి.

ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం

1948లో దేశ వ్యాప్తంగా ఎన్‌సీసీ శిక్షణలు ప్రారంభం కాగా నేడు మారుమూలలకు సైతం చేరుకుని క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నాయి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేలా ఎన్‌సీసీ తయారు చేస్తుంది. విద్యార్థులు, యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపడంతోపాటు జాతీయ భావాన్ని పెంపొందించడం, ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలు అందుకునేలా ప్రోత్సహిస్తుంది. సమాజ సేవా, జాతీయ సమైక్యతాభావం కల్పిస్తుంది. వరదలు వంటి విపత్తుల్లోనూ ఎన్‌సీసీ క్యాడెట్లు తమ సహాయసహకారాలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

ప్రవేశాలకు అర్హత..పటిష్ఠ తర్ఫీదు

13 ఏళ్లు నిండి 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్‌సీసీ క్యాడెట్లుగా చేరేందుకు అర్హత ఉంటుంది. శారీరక దృఢత్వం పరిగణలోకి తీసుకుని బరువు, ఎత్తు, పరుగు వంటి పోటీలను నిర్వహించి అర్హత సాధించిన విద్యార్థులను ఎంపిక చేస్తారు. రెండేళ్లపాటు ప్రతి నెలా మూడు రోజులు శిక్షణ ఇస్తారు. వీటితోపాటు ఇతర ప్రాంతాల్లోనూ సదరు క్యాడెట్లకు శిబిరాలు నిర్వహిస్తారు. డ్రిల్ ప్రాక్టీస్, ఆయుధ శిక్షణ, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, సామాజిక సేవా, ఆరోగ్య అంశాలపై అపార అనుభవం ఉన్న అధ్యాపకులచే తర్ఫీదు ఇస్తారు.

కొలువుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు

పదో తరగతి స్థాయిలో 'ఎ' సర్టిఫికెట్, ఇంటర్ స్థాయిలో 'బి' సర్టిఫికెట్, ఆ పైస్థాయిలో ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్లు అందిస్తారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తుంటాయి. 'సి' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు వస్తాయి. ప్రధానంగా భారత ఆర్మీలో చేరాలనుకుంటే వీరికి ఎలాంటి ప్రవేశ పరీక్షలు ఉండవు. ఇందులో 50శాతం రిజర్వేషన్ ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 2 శాతం అవకాశం కల్పిస్తారు. మెడికల్, ఇంజినీరింగ్ ఉన్నత చదువుల్లోనూ ఒక శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పిస్తుంది. ఎ, బి, సి మూడు సర్టిఫికెట్లు ఉన్న వారికి అధిక ప్రాధాన్యం ఉంటుంది.

'సి' సర్టిఫికెట్ వరకు కొనసాగిస్తా

ఎ.గోపీచంద్, ఎన్‌సీసీ క్యాడెట్, ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాల, సత్తుపల్లి

మనకు దేశం ఏమిస్తుందని కాకుండా మనం దేశానికి ఏమి ఇవ్వాలనే ఆలోచన అందరిలో ఉండాలి. ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఏదైనా సాధించగలమనే ధైర్యం వస్తోంది. ఇక్కడితో ఆగకుండా 'సి' సర్టిఫికెట్ సాధించేవరకు శిక్షణ తీసుకుంటా.

యువతకు ఉపయుక్తం: షాకీర్ హుస్సేన్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి, సత్తుపల్లి దేశ భద్రత కాపాడటంలో ముందువరుసలో ఉండేలా క్యాడెట్లను తీర్చిదిద్దుతున్నాం. దేశ భక్తితోపాటు ఇతరులను గౌరవించడం, ప్రేమ, ఆప్యాయతలు పెంపొందేలా శిక్షణలు ఇస్తున్నాం. ఏదైనా సాధించాలనే తపన, పట్టుదల వీరిలో వస్తుంది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ నైపుణ్యాలను మెరుగు పరచుకునే విధంగా ఎన్‌సీసీ యువతకు ఉపయుక్తంగా ఉంటుంది.

# పక్కాగా దస్తావేజు పత్రాల లెక్క



ఖమ్మం : ఆస్తుల క్రయవిక్రయాలు సహా పలు ఆర్థిక లావాదేవీలు, ప్రమాణ పత్రాలు రాసుకునేందుకు దస్తావేజు పత్రాల(అగ్రిమెంట్ స్టాంప్ పేపర్లు) లెక్క పక్కాగా తేలనుంది. స్టాంప్ వెండర్స్ విక్రయించే దస్తావేజు పత్రాల వివరాలు కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందే. ఇందుకు అనువుగా స్టాంపు వెండర్స్‌కు ఆన్‌లైన్‌లో నమోదుపై తర్ఫీదు ఇచ్చారు. నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా స్టాంపు పత్రాల విక్రయాల లెక్కలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తపరుస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పాత తేదీలతో స్టాంపు పత్రాలను వెండర్ల వద్ద కొనుగోలు చేయటం సాధ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల్లో భాగంగా భూములు, స్థలాల క్రయవిక్రయాల్లో ఉపయోగించే స్టాంపు పత్రాల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడింది. ఉభయ జిల్లాల్లోని స్టాంపు వెండర్స్ మొదట ఈవిధానాన్ని వ్యతిరేకించినా, తర్ఫీదు తర్వాత సులభంగా ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారు.

వీటి వినియోగం అధికం

రూ.20, రూ.50, రూ.100 ముఖ విలువ స్టాంపు పత్రాలను అధికంగా వినియోగిస్తుంటారు. ఒక రిజిస్టర్‌లో పేరు, తేదీ రాసి సంతకం తీసుకుని వెండర్స్ వీటిని ఇచ్చేవారు. కొన్నేళ్లుగా ఇదే విధానం కొనసాగుతోంది. ఇలా విక్రయించిన పత్రం ఎవరు, ఏ అవసరానికి ఉపయోగిస్తున్నారో తెలుసుకునే అవకాశం ఉండేది కాదు. తాజా పద్ధతిలో స్టాంపు పత్రంపై ముద్రించిన సంఖ్య ఆన్‌లైన్‌లో నమోదవటం వల్ల ముద్రణాలయం నుంచి రాష్ట్రం, జిల్లాకు చేరితే ఆ వివరాలు తెలుస్తాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, అక్కడి నుంచి స్టాంప్ వెండర్‌కు చేరిన పత్రాల సంఖ్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. చివరగా స్టాంప్ వెండర్ ఎవరికి విక్రయించారో ఆన్‌లైన్‌లో వివరాలు నిక్షిప్తపరచటం వల్ల ఆ నంబర్ పత్రం ఎక్కడుంది, ఎలా ఉపయోగించారో తెలుస్తుంది.

మరిన్ని ఫ్రాన్‌కింగ్ యంత్రాలు

ఆస్తులు బ్యాంకులో తాకట్టుపెట్టి మార్ట్‌గేజ్ రుణాలు తీసుకుంటారు. ఈ సమయంలో అగ్రిమెంట్ పత్రాలపై తగు విలువతో ఫ్రాన్‌కింగ్ యంత్రం ఉపయోగించి ముద్ర వేస్తారు. ఈ యంత్రాలు ఖమ్మంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే ఉండేవి. ఇటీవల కొన్ని బ్యాంకులు, చిట్‌ఫండ్ సంస్థలకు అందుబాటులోకి వచ్చాయి. యంత్రం ఉపయోగించి ఎన్ని పత్రాలపై ఎంత విలువతో ముద్రలు వేశారనే విషయం ఆన్‌లైన్ విధానంలో తెలిసిపోతుంది. మొబైల్ ఫోన్‌లో రీఛార్జ్ చేసుకున్నట్లు ముందుగా రిజిస్ట్రేషన్ల శాఖకు డబ్బు చెల్లించి యంత్రం ద్వారా ముద్రలు వేస్తుంటారు. ఆన్‌లైన్‌లో డబ్బు అయిపోతే మరోసారి రీఛార్జి చేసుకోవాలి.

స్టాంపు పత్రాల విక్రయాల వివరాలను ఆన్‌లైన్‌లో నెల రోజులుగా నమోదు చేస్తున్నాం. దీనివల్ల నకిలీ పత్రాలకు అడ్డుకట్ట పడింది. గతంలో నకిలీ పత్రాలు చెలామణిలో ఉండేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నకిలీ పత్రాలకు తావుండదు వెండర్స్ సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

అడపా రవీంద్రబాబు,జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, ఖమ్మం

# స్టేషన్‌ఘన్‌పూర్‌కు 100 పడకల ఆసుపత్రి

భూపాలపల్లి: ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న నియోజకవర్గ ప్రజల కల నెరవేరబోతోంది. అధునాతన ఆరోగ్య వైద్య సేవలు ప్రజల ముంగింట్లోకి చేరబోతున్నాయి. ప్రస్తుతం ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా మారుస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. నూతన భవన నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు రూ.37.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏరియా ఆస్పత్రి జనగామ జిల్లా కేంద్రంలో ఉండగా ఇటీవల జనగామకు వైద్య కళాశాల మంజూరైంది. దీంతో జనగామ ఏరియా ఆస్పత్రి డీఎంఈ పరిధిలో చేరి బోధనాస్పత్రిగా మారింది. గతంలో వైద్య విధాన పరిషత్‌లో ఉన్న ఏరియా ఆస్పత్రిని మరోచోట నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌కు 100 పడకల ఏరియా ఆస్పత్రిని మంజూరు చేసింది. మరింత మంది వైద్యులు, నర్సింగ్ సిబ్బంది రానున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న మండలాలతో పాటు పాలకుర్తి మండలంలోని పలు గ్రామాలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రజల కోరిక నెరవేర్చేందుకు ఎమ్మెల్యే రాజయ్య చేసిన ప్రయత్నం ఫలించిందని భారాస నాయకులు పలువురు పేర్కొని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి నియోజకవర్గ ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా దృష్టిసారించి ప్రభుత్వం తరపున మంజూరు ఉత్తర్వులు ఇప్పించారని ఆ వర్గీయులు ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు.

# చెరువు.. ఏదీ ఆదరవు!

భూపాలపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సాగునీటి పారుదల శాఖ పరిధిలోని చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నాలుగైదేళ్ల క్రితం మిషన్ కాకతీయ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టినవి కూడా అధిక వర్షాల కారణంగా గండ్లు పడి నీరు అందకుండా వృథాగా పోవడంతో పలువురు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడమే కాకుండా ఒక్కసారిగా కురిసిన వర్షాలతో చెరువులు కుంటలు కేవలం రెండు, మూడు రోజుల్లోనే మత్తళ్లు పడి చాలా వరకు కట్టలు తెగిపోయాయి. తాత్కాలిక మరమ్మతులు, శాశ్వత నిర్మాణ పనులకు సాగునీటి పారుదల శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో మొత్తం చెరువులు, కుంటలు కలిసి 832 ఉండగా, ఇందులో 159 చెరువులకు గండ్లు పడ్డాయి. వీటికి తాత్కాలిక, శాశ్వత పనుల కోసం రూ.90 కోట్లు అవసరమని ఆ శాఖ తేల్చింది. ఇందులో చిన్నకుంటలు, చెరువులకు పడిన గండ్లు పూడ్చటానికి తాత్కాలికంగా రూ.12 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి పంపించిన నివేదికలో పేర్కొన్నారు.

భూపాలపల్లి డివిజన్‌లోనే ఎక్కువ నష్టం

జిల్లాలోని భూపాలపల్లి సాగునీటి పారుదల శాఖ డివిజన్ పరిధిలోనే అత్యధికంగా చెరువులు, కుంటలు దెబ్బతిన్నాయి. ఈ డివిజన్‌లో భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, రేగొండ, గణపురం, శాయంపేట మండలాల్లోనే పెద్ద మొత్తంలో గండ్లు పడ్డాయి. అత్యధికంగా వర్షపాతం నమోదు కావడం, వరద ఉధృతి ఎక్కువగా ఉండడం, వరద నీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో గండ్లు పడ్డాయని పలువురు సాగునీటి పారుదలశాఖ అధికారులు



చెబుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని పలిమెల, మహదేవపూర్ మండలాల్లో మొత్తం 79 చెరువులుంటే ఇటీవల కురిసిన వర్షాలతో ఒక్క చెరువు కూడా తెగిపోలేదు. మహాముత్తారం, కాటారం, మల్హర్ మండలాల్లో మొత్తం చెరువులు 235 ఉన్నాయి. ఇక్కడ కేవలం మల్హర్ మండలంలోని నాచారం, తాడ్వాయి గ్రామాల్లో మూడు చెరువులు మాత్రమే గండ్లు పడ్డాయి. మిగతా చోట్ల పెద్దగా నష్టం జరగలేదు. నాలుగు రోజుల క్రితం నీటి పారుదల శాఖ ఎస్ఈ మోహన్‌రావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ ప్రసాద్, తదితర ఏఈలు జిల్లా వ్యాప్తంగా తెగిపోయిన చెరువులు, కుంటలను పరిశీలించిన విషయం తెలిసిందే. ఇప్పటికే గండ్లు పడిన కొన్ని చెరువులకు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

అధిక వర్షాల కారణంగా గండ్లు పడిన చెరువులకు యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా మరమ్మతు పనులు చేపడుతాం. ఆయకట్టు రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెండు రోజుల క్రితమే కేంద్రం బృందం కూడా తెగిపోయిన చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలను పరిశీలించి, జరిగిన నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటల మరమ్మతులకు రూ.90 కోట్లతో ప్రాథమిక అంచనాలు రూపొందించాం. నిధులు విడుదల కాగానే శాశ్వత మరమ్మతు పనులు చేపడుతాం. మోహన్‌రావు, నీటిపారుదల శాఖ ఎస్ఈ, భూపాలపల్లి

# పేరుకే సంక్షేమం

భూపాలపల్లి : తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు రద్దు చేసిన తర్వాత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డులు కేవలం పేరుకే పరిమితమయ్యాయి.. సంక్షేమ బోర్డు సభ్యులు సైతం తాము తోటి ఉద్యోగుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించలేక పోతున్నామనే ఆవేదనలో ఉన్నారు. కార్మిక సంఘాల వ్యవస్థ లేకపోవడంతో గతంలో సమ్మెలు, ధర్నాలు, నిరసనలు చేసి, యాజమాన్యంపై ఒత్తిడి పెంచే పరిస్థితి కూడా లేదు.. 2020 జనవరి 1 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది డిపోల్లో సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేశారు. ఉద్యోగుల్లో నుంచి ఇద్దరు సభ్యులు డిపో మేనేజర్ అధికారిగా ఉంటారు. ఉద్యోగులు తమ సమస్యలను సంక్షేమ బోర్డుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేశారు. బోర్డు సభ్యులు ప్రతి వారం సమావేశమై ఆయా సమస్యలపై చర్చించి పరిష్కరించాలి. తమ పరిధిలో లేని వాటిని ఆర్ఎం, ఎండీ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పలు డిపోల్లో ఈ పెట్టెలను డీఎం కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయడంతో ఏదైనా సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేయటానికి భయపడుతున్నారు. దీంతో అవి వెలవెలబోతున్నాయి. అదేవిధంగా వారానికి కాకుండా నెలకు ఒకసారి నామమాత్రంగా సమావేశాలు నిర్వహించి సంతకాలు తీసుకొని పంపిస్తున్నారని.. తమ సమస్యలు వినకుండా సంస్థ నిర్ణయాలను తెలిపేందుకు మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

అటకెక్కిన హామీలు సమస్యలను పట్టించుకునే వారే లేకపోవడంతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. సమ్మె విరమణ తర్వాత మహిళా సిబ్బంది కోసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. అందులో సరైన ప్రణాళిక, వసతులు లేకుండా నిర్వహించడంతో అవి కొన్ని డిపోల్లో నిరుపయోగంగా మారుతున్నాయి. మహిళా సిబ్బందికి రాత్రి 8 గంటల్లోపు విధులు ముగించాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. వీటిపై దృష్టి పెట్టాలి..వరంగల్ ఆర్టీసీ రీజియన్ స్థాయిలో గతంలో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లో మెరుగైన ఉచిత చికిత్స అందించేది. ఇప్పుడు లేదు.సంక్షేమ బోర్డు కమిటీ సభ్యులను కేవలం డిపో పరిధిలో ఎంపిక చేశారు. కానీ రీజియన్, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయలేదు. మూడున్నరేళ్ల కాలం దాటిన సీఎం కేసీఆర్ సంక్షేమ బోర్డు కమిటీ సభ్యులతో ఇంతవరకు సమావేశం నిర్వహించలేదు.

కార్మికులు ప్రతి నెలా పొదుపు చేసుకున్న కో ఆపరేటివ్ బ్యాంకు(సీసీఎస్) నిధులు రూ.1050 కోట్లు యాజమాన్యం వాడుకుంది. అత్యవసరమైతే కార్మికులు సీసీఎస్ నుంచి రుణం పొందే అవకాశం లేకుండా పోయింది. నిబంధనల ప్రకారం ప్రతి రోజు అదనపు పని భారాన్ని పెంచినా, యాజమాన్యం ఓటీ చెల్లించడం లేదు. వేతనాలు, ఇతర అలవెన్సులు తగ్గించారు. దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సమావేశాల జాడేది?సంక్షేమ బోర్డు కమిటీ సభ్యులను నియమించిన తర్వాత ప్రతి మూడు నెలలకోసారి సీఎం ప్రగతి భవన్‌కు పిలిచి మాట్లాడుతానన్నారు.



# మళ్లీ లోక్‌సభకు రాహుల్..

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మళ్లీ లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. ఆయనపై వేసిన అనర్హతను ఎత్తివేసినట్లు లోక్‌సభ సచివాలయం సోమవారం ప్రకటించింది. 'మోదీ ఇంటిపేరు 'పై చేసిన వ్యాఖ్యల కేసులో ఆయనకు దిగువస్థాయి కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం నేడు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో దిల్లీలోని 10 జన్‌పథ్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకొన్నాయి. సభ్యత్వాన్ని పునరుద్ధరించడంతో రాహుల్ సోమవారం పార్లమెంట్ సమావేశాలకు హాజరుకానున్నారు. ఇక ప్రధాని మోదీ సర్కారుపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఆగస్టు 8వ తేదీ (మంగళవారం) నుంచి లోక్‌సభలో చర్చ జరగనుంది. ఈ చర్చలోనూ రాహుల్ పాల్గొననున్నారు. 2019లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మోదీ ఇంటిపేరును ఉద్దేశిస్తూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై గుజరాత్‌లో కేసు నమోదు కాగా.. ఈ ఏడాది మార్చి 23న సూరత్‌లోని సెషన్స్ కోర్టు ఆయనకు రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వెలువడిన 24 గంటల్లోపే లోక్‌సభ సచివాలయం ఆయన సభ్యత్వంపై అనర్హత వేటు వేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రెండేళ్లు అంతకంటే ఎక్కువకాలం జైలు శిక్ష పడితే.. ఆ తీర్పు వచ్చిన రోజు నుంచే అనర్హత అమల్లోకి వస్తుంది. దీంతో వారి సభ్యత్వం రద్దవుతుంది. అంతేగాక, జైలు నుంచి విడుదలైన తర్వాత మరో ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికీ వీలుండదు. ఈ తీర్పుపై అహ్మదాబాద్ హైకోర్టులో ఊరట లభించకపోవడంతో రాహుల్ ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఆగస్టు 4 తేదీన విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. జైలు శిక్షపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అనర్హత ముప్పు నుంచి రాహుల్ బయటపడ్డారు. వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ రాహుల్ పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది.



# ట్రాఫిక్ ఎఫెక్ట్.. భారీగా నష్టపోతున్న బెంగళూరు..!

బెంగళూరు: దేశ ఐటీ రాజధాని బెంగళూరులో ట్రాఫిక్1ను దాటుకొని, గమ్యస్థానాలకు చేరాలంటే కొన్నిగంటలు వెచ్చించాల్సి ఉంటుంది. ఆ పరిస్థితిపై నెటిజన్లు తాము ఎదుర్కొన్న అనుభవాలు సోషల్ మీడియాలో పంచుకోవడం చూస్తూనే ఉంటాం. ఇలా ట్రాఫిక్ అంతరాయాలు, సిగ్నళ్ల వద్ద వేచి ఉండటం వంటి వాటి వల్ల సమయం, ఇంధనం వృథా కావడంతో బెంగళూరు నగరానికి ఏటా రూ.19,725 కోట్లు నష్టం వాటిల్లుతోంది. ట్రాఫిక్ నిపుణుడు ఎంఎన్ శ్రీహరి, ఆయన బృందం నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. రోడ్ ప్లానింగ్, ఫ్లైఓవర్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, మౌలిక సదుపాయాల లోటు వంటి అంశాలను పరిశీలించిన మీదట ఈ విషయాన్ని వెల్లడించింది. దాదాపు పూర్తిస్థాయిలో పనిచేసే 60 ఫ్లైఓవర్లు ఉన్నప్పటికీ.. బెంగళూరు నగరం ఏటా దాదాపు రూ. 20 వేలకోట్ల రూపాయల భారీ నష్టాన్ని చవిచూస్తోందని ఆ బృందం వెల్లడించింది. ఐటీ రంగంలో వృద్ధితో నగరంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, దాని వల్ల ఇతర సౌకర్యాలు మెరుగవుతున్నాయని తెలిపింది. భారీగా పెరిగిన జనాభాకు తగ్గట్టుగా.. వాహనాల సంఖ్య 1.5 కోట్లకు చేరువగా ఉంది. దానికి తగ్గట్టుగా రోడ్ల విస్తరణ లేదని ఆ బృందం గుర్తించింది. ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకుంటూ వేగంగా పెరుగుతోన్న జనాభాకు తగ్గట్టుగా జరుగుతోన్న మౌలిక సదుపాయాల కల్పన సరిపోవడం లేదని, ఆ వ్యత్యాసమే ఈ ట్రాఫిక్ అంతరాయాలకు కారణమవుతోందని పేర్కొంది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. బెంగళూరు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇక్కట్ల గురించి వివరించారు. ఆ అంతరాయాలను తొలగించేందుకు వీలుగా వివరణాత్మక నివేదికను సిద్ధం చేయాలని కేంద్రమంత్రి.. శివకుమార్‌కు సూచించారు. ఈ క్రమంలోనే శ్రీహరి బృందం ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు ప్లానింగ్‌పై శివకుమార్‌కు నివేదిక ఇచ్చింది.



# పోలీసులపై చంద్రబాబు సీరియస్

ఏలూరు: పుంగనూరులో తెదేపా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి నిర్బంధించారంటూ తెదేపా అధినేత చంద్రబాబు మండిపడ్డారు. పోలీసులు తమ నిర్బంధంలో ఉన్న తెదేపా నాయకులను కోర్టులో హాజరుపరచకుండా హింసిస్తున్నారని ఆరోపించారు. విచారణ పేరుతో అరెస్టు చేసి కస్టడీలో కార్యకర్తలను హింసకు గురిచేస్తే.. అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. "అరెస్టు చేసిన వారి నుంచి బలవంతంగా తప్పుడు స్టేట్‌మెంట్లపై సంతకాలు తీసుకుంటున్నారని తెలిసింది. పుంగనూరులో రాజకీయ నేతలను సంతృప్తి పరచడానికి తప్పులు చేసే ప్రతి అధికారి తర్వాతి కాలంలో సమాధానం చెప్పాల్సి వస్తుంది. అరెస్టైన పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి. పార్టీ అండగా ఉంటుంది. మీ తరఫున తప్పకుండా న్యాయ పోరాటం చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. పుంగనూరు సమీపంలోని భీమగానిపల్లె వద్ద చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన సంఘటనకు సంబంధించి ఆదివారం 62 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే విషయమై అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు నేతలు ఏలూరులో చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. అంగళ్లులో మారణాయుధాలతో దాడులకు యత్నించారని నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఘంటా నరహరి, శ్రీరాం చినబాబులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారని వివరించారు. పుంగునూరు ఘటనలో 5, అంగళ్లు ఘటనలో 2 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.

# జగన్ పర్యటనలో పోలీసుల అత్యుత్సాహం




కుక్కునూరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం జగన్ పర్యటిస్తున్నారు. అయితే సీఎం పర్యటన బందోబస్తులో ఉన్న పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వరద బాధితులను గ్రామంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. తమ బాధలను సీఎంతో చెప్పుకుంటామని అడిగినా పోలీసులు నిరాకరించారు.

దీంతో సీతారామపురం నుంచి పొలాల మీదుగా సుమారు 3.కి.మీ నడిచి సభాస్థలికి చేరుకునేందుకు పలువురు గ్రామస్థులు వెళ్లారు. మండలంలోని పలు గ్రామాల డ్వాక్రా మహిళలకు పాసులు ఇచ్చి బస్సుల ద్వారా తరలించారు. అయితే వరద ప్రభావంతో ఇబ్బందులు పడిన గొమ్ముగూడెం బాధితులకు మాత్రం అనుమతి లేదంటూ పోలీసులు వెనక్కి పంపేశారు. దీంతో పోలీసుల వైఖరిపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చేనేత కుటుంబాలకు అండగా నిలవాలి



అమరావతి: చేనేత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుఅండగా నిలవాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..భారతదేశం హస్త కళలకు పుట్టినిల్లని.. అటువంటి కళల్లో ముఖ్యమైనది చేనేత కళ అని చెప్పారు. అగ్గి పెట్టెలో పట్టే చీరను నేత కళాకారులు రూపొందిస్తే, ఆ గొప్పతనం చూసి ప్రపంచం అబ్బురపడిందన్నారు. నేడు 'చేనేత దినోత్సవం' జరుపుకొంటున్న శుభ తరుణంలో తన తరఫున, జనసేన తరఫున ఈ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక కాలంలో కాస్తంత మసకబారిన ఈ చేనేత కళకు పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రజలు సైతం తమ వంతు కృషి చేయాలని చెప్పారు. ప్రజలంతా విధిగా వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. ఘన చారిత్రక నేపథ్యం కలిగిన చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ గా తనను అంకితం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.. ఈ కళనే నమ్ముకుని, ఈ కళను సజీవంగా నిలుపుతూ జీవిస్తున్న చేనేత కుటుంబాలను ప్రభుత్వాలు ఆసరాగా ఉండాలని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# తితిదే ప్రత్యేక ఆహ్వానితుల నియామకంపై హైకోర్టులో విచారణ వాయిదా

అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితుల నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై హైకోర్టులో ఇవాళ విచారణ జరిగింది. ఈ నియామకాలకు వీలు కల్పిస్తూ ఏపీ దేవాదాయ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చిన సంగతి తెలిసిందే. బోర్డులో భారీగా ప్రత్యేక ఆహ్వానితులను నియమించటం నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపించారు. గతంలో ప్రత్యేక ఆహ్వానితుల నియామకంపై న్యాయస్థానం స్టే విధించిందని.. దీంతో నియామకానికి చట్టబద్ధత కల్పించేందుకే దేవాదాయశాఖ చట్టాన్ని సవరించారన్నారు. వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు, నేటి తితిదే బోర్డు సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరుతూ పలువురు ప్రత్యేక ఆహ్వానితులు వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేసింది.



# నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు ఇది అర్థం కాలేదు: ప్రధాని మోదీ



ఫరీదాబాద్: గ్రామాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థను అమలు చేయడం ఎంత ముఖ్యమో కాంగ్రెస్ పార్టీ తెలుసుకో లేకపోయిందని ప్రధాని మోదీ విమర్శించారు. రెండు రోజుల పాటు జరగనున్న భాజపా వీడియో కాన్ఫరెన్స్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థను అమలుచేయడం ఎంతో ముఖ్యమని మోదీ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు దశాబ్దాల్లో కాంగ్రెస్‌కు ఈ విషయం అర్థం కాలేదని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదని ఆరోపించారు. జిల్లా పంచాయతీ వ్యవస్థను కూడా కాంగ్రెస్ పట్టించుకోకుండా గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. ప్రస్తుతం భారత్ లక్ష్యాలను, 'అమృత్ కాల్' తీర్మానాలను నెరవేర్చడానికి దేశం ఐక్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఈ అమృత్‌కాల్‌లోని 25 ఏళ్ల ప్రయాణంలో గత దశబ్దాల అనుభవాలను గుర్తుచేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి పథంలో టియర్-2, టియర్-3 నగరాలతోపాటు గ్రామాలు కూడా ఉన్నాయన్నారు. ఫరీదాబాద్‌లోని సూరజ్‌కుండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు ఓపీ ధన్‌ఖడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ సీఎంవోలో ఒక్కో పనికి ఒక్కో ధర!

గుంటూరు: జనసేన రోజురోజుకూ బలపడుతోందని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన పార్టీ అభ్యర్థిగా తెనాలి నుంచి పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గుంటూరులో నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం ధాటికి సామాన్యులు చితికిపోతున్నారని ఆయన విమర్శించారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఏపీ ప్రభుత్వం హైదరాబాద్‌లోని ప్రైవేటు సంస్థలకు పంపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో సర్పంచులను డమ్మీలుగా చేసి వాలంటీర్లు పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు. సీఎం పేషీలో జరిగిన డేటా చోరీపై ముఖ్యమంత్రి జగన్ మాట్లాడరా అని ప్రశ్నించారు. "ఇ-ఫైలింగ్ పేరుతో సీఎంకు తెలియకుండానే సంతకాలు జరిగిపోతున్నాయి. సంతకాలు పూర్తయిన 220 ఫైళ్లు దేనికి సంబంధించినవో చెప్పాలి. సీఎంవోలో ఇష్టారాజ్యంగా డబ్బులు చేతులు మారుతున్నాయి.

ఒక్కో పనికి ఒక్కో ధర పెట్టి మరీ వసూలు చేస్తున్నారు. మంత్రులకు ఏ విషయంపైనా కనీస సమాచారం ఉండట్లేదు. కోర్టు ఆదేశాలు ధిక్కరించి మరీ ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. తితిదే ఛైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి నియామకం వల్ల ఒరిగేదేమీ ఉండదు" అని నాదెండ్ల మనోహర్ అన్నారు.

# ప్రభుత్వ తప్పులను పవన్ ఎత్తి చూపితే అభ్యంతరం లేదు.. కానీ..!



కృష్ణా జిల్లా: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కొడాలి నాని విమర్శలు గుప్పించారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "రాజకీయంగా తమను ఎదుర్కొంటే పవన్ కళ్యాణ్‌కు సమాధానమిస్తాం. ఎన్నికలు అయ్యేవరకు పవన్‌కళ్యాణ్ ఎన్ని యాత్రలు చేసినా తమకు అభ్యంతరం లేదు. పవన్ కళ్యాణ్ మద్దతుదారుల అంతిమ లక్ష్యం చంద్రబాబును కనీసం ప్రతిపక్ష నేతగానైనా చూడాలని కోరుకుంటున్నారు. చంద్రబాబు రక్తంలోని ప్రతి అణువులో వెన్నుపోటు ఉంది. ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్‌కు స్వయంగా చెప్పేందుకు అనేక సార్లు ప్రయత్నించాను. కుదరకపోవడంతో మీడియా ద్వారా విజ్ఞప్తి చేస్తున్నా. చంద్రబాబును గుడ్డిగా నమ్మితే పవన్‌కళ్యాణ్ కూడా అధోగతి పాలవుతారు. రాజకీయాల్లో వైసీపీకి ఎదురు నిలిచి.. ప్రభుత్వ తప్పులను పవన్ కళ్యాణ్ ఎత్తి చూపితే తమకు అభ్యంతరం లేదు. బినామీలతో కలిసి తమపై దాడి చేస్తే సహించేది లేదు. అదే స్థాయిలో ప్రతి విమర్శ చేస్తాం. రాజకీయాలను మారుస్తానంటున్న పవన్ కళ్యాణ్.. ఏ రకంగా చంద్రబాబు మద్దతుదారులతో కలిసి నడుస్తారు." అని కొడాలి నాని ప్రశ్నించారు. "మంత్రి పెద్దిరెడ్డి పేరు చెబితేనే చంద్రబాబు ఉలిక్కి పడే పరిస్థితి. కుప్పం మరియు ఆంధ్రప్రదేశ్ నుంచి చంద్రబాబును తరిమికొట్టే వరకు పెద్దిరెడ్డి నిద్రపోరు. పక్క రాష్ట్రాల్లోని జనాలను పోగేసి కొచ్చి పుంగనూరులో చంద్రబాబు సాధించింది ఏముంది. చంద్రబాబుకు మంగళం పాడి, రాజకీయాల నుంచి చరమగీతం పాడేది పెద్దిరెడ్డి మాత్రమే. 40 ఏళ్ల ఇండస్ట్రీ చంద్రబాబు తన హయాంలో ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారు ప్రకటించాలి. ప్రాజెక్టుల పరిశీలన పేరుతో రాష్ట్రంలో చంద్రబాబు విచిత్ర విన్యాసాలు చేస్తున్నారు. స్వతంత్రం వచ్చిన తర్వాత కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ 70 ఏళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయి. కనీసం ఆయన జిల్లాకు చెందిన గాలేరు నగరి కాలువను తవ్వలేని చంద్రబాబు.. ప్రాజెక్టుల పేరుతో పర్యటనలు చేయడం హాస్యాస్పదం. ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన తెలుగు గంగానే పూర్తి చేయలేని మొనగాడు చంద్రబాబు. 20 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన టీడీపీ.. పోలవరానికి వంద కోట్ల పనులు కూడా ఎందుకు చేయలేదు." అని కొడాలి నాని నిలదీశారు.

# మంత్రి అప్పలరాజుపై ఈసీకి ఫిర్యాదు చేసిన అచ్చెన్నాయుడు..




అమరావతి: అర్హత ఉన్నప్పటికి ప్రతిపక్ష పార్టీల ఓట్లను... సానుభూతిపరుల ఓట్లను తొలగించాలంటూ మంత్రి సిదిరి అప్పల రాజు చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకువెళ్ళారు. ఫామ్-7 ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 20.50 లక్షల ఓట్లను తొలగించారని, ఏ కారణంతో ఓట్లు తొలగించారో వివరిస్తూ జాబితా ఇవ్వాలని కోరారు. మంత్రి అప్పల రాజుపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సత్వరమే చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

## ఈ చంద్రముఖి భయపెట్టేలా లేదే..?

చంద్రముఖి సినిమా వచ్చి రెండు దశాబ్దాలు అవుతోంది. కానీ, ఆ మూవీ క్రియేట్ చేసిన ఇంపాక్ట్ అంతా ఇంతా కాదు. రజనీకాంత్ కెరీర్ లోనే వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ హిట్ సినిమాగా దీని ని చెప్పొచ్చు. ఈ మూవీ ని అప్పట్లో అన్నిభాషల్లోనూ చిత్రీకరించారు. ఈ మూవీకి సీక్వెన్స్ గా నాగవల్లి తీశారు. రజనీకాంత్ నటించడానికి అంగీకరించకపోవడంతో, వెంకటేష్ నటించారు. కానీ అది అస్సలు ఆకట్టుకోలేదు. కాగా..ఇప్పుడు మళ్లీ చంద్రముఖి 2 పేరిట సీక్వెల్ తీస్తున్నారు. దాదాపు 17ఏళ్ల తర్వాత ఈ సినిమా కు సీక్వెల్ తెరకెక్కుతుండటం విశేషం. లారెన్స్ , కంగనా రనౌత్ ప్రధాన పాత్రల్లో ఈ మూవీ తెరకెక్కుతోంది. అయితే, చంద్రముఖి మూవీ అనగానే రజనీకాంత్ ఎంత గుర్తుకు వస్తాడో. జ్యోతిక కూడా వెంటనే గుర్తుకు వస్తుంది. చంద్రముఖి పాత్రలో జ్యోతిక నటనకు ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. ఆమె తన నటనతో అందరినీ భయపెట్టింది కూడా. ఇప్పటికీ ఆ మూవీ చూసినా, జ్యోతిక నటన కు భయపడతారు.




అయితే, తాజాగా సీక్వెన్స్ మూవీ లో ఆ పాత్రలో కంగనా నటిస్తోంది. కంగనా పోస్టర్ కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్ లో కంగనా చాలా అందంగా కనపడుతోంది. చంద్రముఖి అంటే భయపెట్టాలి కదా, మరీ చంద్రముఖి ఏంటి ఇంత అందంగా కనపడుతోంది అనే కామెంట్స్ వినపడుతున్నాయి. మరి పోస్టర్ లో అందంగా కనపడుతోంది, సినిమ1ూ లో భయపెట్టే అవకాశం ఉందనే కామెంట్స్ వినపడుతున్నాయి. చూడాలి మరీ, జ్యోతిక ను మించి కంగనా భయపెడుతుందో లేదో. ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితం ఈ మూవీ నుంచి లారెన్స్ లుక్ ని విడుదల చేశారు. లారెన్స్ రాజు గెటప్ లో కనిపిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా ఆయన లుక్ ఉంది. అయితే, రజనీకాంత్ లా మాత్రం ఆకట్టుకోలేకపోయాడు అనే కామెంట్స్ వినపడుతున్నాయి. లారెన్స్ లుక్ పై కొందరు పాజిటివ్ గా కామెంట్స్ చేస్తుంటే, మరి కొందరు నెగిటివ్ గా కామెంట్స్ చేస్తుండటం గమనార్హం. ఈ సినిమాకి పి. వాసు దర్శకత్వం వహిస్తున్నారు. హార్రర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టాకీ పార్ట్ పూర్తయినట్లు చిత్రబృందం వెల్లడించింది. ఇక ఈ సినిమా ను వినాయక చివితి సందర్భంగా సెప్టెంబర్ మాసం లో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఎమ్.ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా పై చిత్ర బృందం పై ప్రశంసల వర్షం కురుస్తోంది. చంద్రముఖి 2 తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు.

## ఆ సీన్స్ చేయకపోతే ఆంటీని చేసేస్తారు: తమన్నా

సుమారు రెండు దశాబ్దాల సుదీర్ఘమైన ఇన్నింగ్స్ ని సాగించింది తమన్నా భాటియా. తెలుగు-తమిళం-హిందీ భాషల్లో నటిగా కొనసాగుతోంది. ముంబై టు హైదరాబాద్ తన జర్నీ ఎంతో ఆసక్తికరమైనది. చెన్నై- ముంబై పరిశ్రమల్లోను మిల్కీ వైట్ బ్యూటీ కి బోలెడంత ఫాలోయింగ్ ఉంది. ఇప్పటికీ తెలుగు తమిళ సినీపరిశ్రమలతో తమన్నాకు మంచి అనుబంధం ఉంది. ఇక్కడ అగ్ర హీరోల సరసనా ఆడిపాడుతోంది. నేటితరం నుంచి ఎంతగా పోటీ ఉన్నా కానీ సీనియర్ హీరోలకు తమన్నా యాప్ట్ కావడంతో వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ఇప్పటికిప్పుడు మెగాస్టార్ చిరంజీవి.. సూపర్



స్టార్ రజనీకాంత్ ల సరసన నటించిన సినిమాలు రిలీజ్ లకు రెడీ అవుతుండగా ఈ రెండిటిలో నటించిన తమన్నా స్పెషల్ ట్రీట్ గురించి యూత్ లో చర్చ సాగుతోంది. తమన్నా నటించిన జైలర్ – భోళాశంకర్ చిత్రాలకు ప్రచారం స్పీడందుకుంది. తాజాగా మీడియా సమావేశంలో తమన్నా ఘాటైన ఇంటిమేట్ సన్నివేశాల గురించి మాట్లాడింది. హీరోలతో ఘాటైన సన్నివేశాలలో నటించడం గురించి మాట్లాడుతూ కొత్త తరాన్ని లక్ష్యం చేసుకుని అలాంటి సీన్స్ చేస్తామని తెలిపింది. వారిని మెప్పించడానికి అంచనాలకు తగ్గట్టుగా ఇంటిమేట్ సీన్స్ చేయడానికి ఒప్పుకోవాలని తమన్నా అన్నారు. ఒకవేళ తాను అలాంటి సన్నివేశాల్లో నటించడానికి అంగీకరించకపోతే దర్శకనిర్మాతలు తనను యువ హీరోల పక్కన చెల్లెలు లేదా ఆంటీ పాత్రలకు ఎంపిక చేస్తారని కూడా చెప్పింది. ఇటీవల తమన్నా వరుసగా వెబ్ సిరీస్ లకు సంతకాలు చేస్తున్న సంగతి తెలిసిందే. విజయ్ వర్మతో కలిసి ఘాటైన శృంగార సన్నివేశాల్లో నటించిన తమన్నా తదుపరి సినిమాలపైనా ఫోకస్ పెట్టింది. మాస్ ఆడియన్స్‌ని ఆకర్షించడానికి మరిన్ని వెబ్ డ్రామాలతో పాటు కమర్షియల్ సినిమాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని తమన్నా తాజా ఇంటర్వ్యూలో తెలిపింది. రజనీ సర్ తో జైలర్ .. చిరుతో భోళా శంకర్ చిత్రాల్లో నటించిన తమన్నా ఈ రెండు సినిమాలు విజయం సాధిస్తాయన్న ధీమాను కనబరుస్తోంది.




## తలైవా.. చిరు జోరును తట్టుకోగలరా?




మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ రజనీకాంత్.. ఇప్పటికీ వరుస సినిమాల్లో నటిస్తూ కెరీర్ లో ఫుల్ బిజీగా ఉంటున్నారు. అయితే ఈ ఇద్దరు హీరోలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా తలపడిన సందర్భాలు లేవు. కానీ ఈ సారి మాత్రం తలపడబోతున్నారు. చిరు భోళాశంకర్ తో(ఆగస్ట్ 11) రానుండగా.. రజనీకాంత్ జైలర్ గా(ఆగస్ట్ 10) రానున్నారు. ఈ రెండు చిత్రాలు ఒక్క రోజు గ్యాప్ లో రానున్నాయి. దీంతో బాక్సాఫీస్ వార్ మెగా స్టార్ వర్సెస్ సూపర్ స్టార్ గా కొంతమంది సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. మరి కొందరు చిరు ఉన్న ఫామ్ కు రజనీ పోటీయే కాదని అంటున్నారు. అయితే విషయానికొస్తే.. 'ఖైదీ నెంబర్ 150' చిత్రం తర్వాత తమ ఇమేజ్ కు తగ్గట్టు సరైన విజయాన్ని అందుకోలేకపోయిన చిరు.. ఈ ఏడాది 'వాల్తేరు వీరయ్య'తో ఆ సక్సెస్ ను చూశారు. చిరు సెకండ్ ఇన్నింగ్స్ కెరీర్ కు ఇదో మలుపు అనే చెప్పాలి. అసలు చిరు మూవీస్ ను ఈ జనరేషన్ ఆడియెన్స్ రిసీవ్ చేస్తారా లేదా.. మళ్లీ చిరు రికార్డులు సృష్టించే సత్తా ఉందా లేదా అన్న అనుమానాలు వచ్చిన నేపథ్యంలో.. వాల్తేరు వీరయ్య దానికి సమాధానం ఇచ్చింది. రొటీన్ కంటెంట్ తోనే వచ్చినా చిరు మాస్ ఇమేజ్ కు తగ్గట్టు ఉండడంతో భారీ వసూళ్లను అందుకుంది. 'వాల్తేరు వీరయ్య' కన్నా ముందుకు వచ్చిన 'గాడ్ ఫాదర్' కూడా మంచి హిట్ నే అందుకుంది. అలా చిరు మంచి ఫామ్ లోకి వచ్చేశారు. దీంతో 'భోళాశంకర్'పై అభిమానులు, సినీ ప్రియులు భారీ అంచనాలే పెట్టుకున్నారు. రీసెంట్ గా రిలీజైన ట్రైలర్ కట్ కూడా ఫ్యాన్స్ కు బాగానే ఆకట్టుకుంది. ఇక ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూసేద్దామా అంటూ ఫ్యాన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. అయితే ఈ 'భోళాశంకర్' రిలీజ్ కు ఒకరోజు ముందే సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్' కూడా ఇక్కడ విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన యాక్షన్ ట్రైలర్ కూడా బాగానే ఆకట్టుకుంది. పాన్ ఇండియా స్థాయి లో ఇది ఆడియెన్స్ ముందుకు రానుంది. సాధారణంగా రజనీ సినిమా అంటే ఏ ఇండస్ట్రీ అభిమానుల్లో అయినా భారీ క్రేజ్ ఉంటుంది. కానీ ఈ మధ్య ఆయన వరుస ఫ్లాప్ లతో సతమతమవుతున్నారు.

## లెహంగాలో క్లీవేజ్ ఫోజులతో కవ్విస్తున్న అలాయా..!



బాలీవుడ్ లో ఈ మధ్యకాలంలో వరస అవకాశాలు అందుకుంటోన్న బ్యూటీ అలాయా. ఈ బామ ఇండస్ట్రీలోకి ఇటీవలే అడుగుపెట్టింది. కానీ, అడుగుపెట్టి పెట్టగానే అందరినీ తన అందంతో ఆకర్షించడం మొదలుపెట్టింది. జవానీ జానేమన్ సినిమాతో అలాయా బాలీవుడ్ లో అడుగుపెట్టింది. మొదటి సినిమాలోనే ఆమె అందానికి అందరూ ఫిదా అయిపోయారు. ఆ తర్వాత ఆమెకు మరో, రెండు మూడు సినిమాల్లో ఛాన్సులు వచ్చాయి. కార్తీక్ ఆర్యన్ తో కలిసి ఫ్రెడ్డీ మూవీలో నటించింది. ఈ మూవీలో గ్లామర్ కూడా ఒలకబోసింది. లిప్ లాక్ సీన్లతో హీటు కూడా పెంచింది. కానీ ఈ మూవీ పెద్దగా క్లిక్ కాలేకపోయింది. కాగా, ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన అందాలను సోషల్ మీడియాలో ఆరబోస్తూ ఉంటుంది. తాజాగా లెహంగాలో మెరిసింది. క్లీవేజ్ షోతో హీటు పెంచేసింది. ఈ ఫోటోలు చూసి కుర్రాళ్ల మతిపోతోంది. హాట్, సూపర్ అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అలాయా పూర్తి పేరు అలాయా ఇబ్రహీం ఫర్నీచర్ వాలా. ఒకప్పటి అందాల తార పూజా బేడీ కుమార్తె ఈ అలాయా. కబీర్ బేడీకి మనవరాలు. ముంబయిలోని జమ్నాబాయి నర్సీ స్కూల్ లో చదువుకుంది. సినిమాల్లో ఎంట్రీ ఇవ్వక ముందే న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో యాక్టింగ్ మొదలుపెట్టింది. ఆ తర్వాతే తన పేరును అలాయా ఎఫ్ గా మార్చుకుంది. కాగా, ఈమె తన మొదటి సినిమాలోనే గర్భిణీ గా నటించి అందరికీ షాకిచ్చింది, ఇక ఫ్రెడ్డీ మూవీలో సైతం హీరోని మోసం చేసే పాత్రలో నటించింది. గ్లామర్ గా కనిపిస్తూనే, నటకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. మొదటి సినిమాలోనే తన నటనకు ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకోవడం విశేషం. అలాయాకు ఇన్ స్టాగ్రామ్ లో 1.3 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఈ ఏడాది ఆమె యూటర్న్ అనే మూవీ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇది సమంత చేసిన యూటర్న్ కి రీమేక్ కావడం విశేషం.

## గ్లామర్ గా కనిపించేందుకు ఓకే.. కానీ!

పా రంజిత్ దర్శకత్వంలో ఆర్య హీరోగా రూపొందిన 'సార్పట్టా పరంపరై' సినిమాలో హీరోయిన్ గా నటించిన ముద్దుగుమ్మ దుషారా. సాధారణంగా తమిళనాట రాజకీయ ఫ్యామిలీ నుంచి సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన హీరోలు ఉన్నారు కానీ... హీరోయిన్ లు మాత్రం లేరు. ఆ లోటును దుషారా తీర్చింది. రాజకీయ కుటుంబానికి చెందిన దుషారా సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ ను దక్కించుకోగలదా... అసలు ఆఫర్లు దక్కించుకునేనా అంటూ కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ మొదటి సినిమా సార్పట్టా సినిమాతో విమర్శకుల



ప్రశంసలు దక్కించుకుంది. ప్రస్తుతం వరుసగా సినిమాల్లో నటిస్తోంది. తాజాగా తమిళ స్టార్ హీరో ధనుష్ కి జోడీగా నటించే అవకాశం దక్కించుకుంది. ఫ్యామిలీ పాత్రల్లోనే కాకుండా గ్లామర్ రోల్స్ ను చేయడానికి... కమర్షియల్ పాత్రల్లో కనిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లుగా హీరోయిన్ దుషారా తాజాగా ఒక ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. వల్గర్ గా నటించడం వేరు.. అందంగా కనిపించడం వేరు అన్నట్లుగా ముద్దుగుమ్మ దుషారా చెప్పుకొచ్చింది. హీరోయిన్ గా తాను ఎలాంటి పాత్రల్లో అయినా నటించేందుకు సిద్ధం అన్నట్లుగా చెప్పుకొచ్చింది.

సినిమాల్లో అయిదు నిమిషాల పాత్ర అయినా కూడా ఆ పాత్రకు ప్రాముఖ్యత ఉంటే తప్పకుండా నటిస్తాను అంది. గ్లామర్ గా నటించేందుకు తాను సిద్ధంగా ఉన్నాను. అయితే గ్లామర్ షో కు తాను సిద్ధమే కానీ ఒక హద్దు అం టూ ఉంటుందని ఆమె పేర్కొంది. గ్లామర్ షో కు ఉన్న ఆ హద్దు తనకు తెలుసు అని... ఆ పరిధిలో అందంగా నటించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. అందంగా కనిపించేంత వరకు ఓకే కానీ అశ్లీలంగా కనిపించేందుకు మాత్రం తాను ఆసక్తి చూపించనంటూ చెప్పుకొచ్చింది.

## పూజా హెగ్డే.. ఏంటమ్మా ఈ గ్లామర్ డోస్

నిన్న,మొన్నటి వరకు టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ ఎవరు అంటే ముందుగా పూజా హెగ్డే పేరే వినపడేది. మొన్నటి వరకు ఆమె జోరు అలా సాగింది. ఇప్పుడే కాస్త డల్ అయ్యింది. రెండు, మూడు సినిమాల ఛాన్సులు చేతుల వరకు వచ్చి చేజారాయి. కానీ లేకుంటే మరో రెండు ఏళ్లు పూజాకి తిరుగు ఉండేది కాదు. ప్రస్తుతం పూజా చేతిలో తెలుగులో ఎలాంటి సినిమాలు లేవు. అయినా, ఫ్యాన్స్ బాధపడకుండా ఉండేందుకు సోషల్ మీడియా ద్వారా మాత్రం అలరిస్తూనే ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేసి మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. తాజాగా కూడా బార్బీ గర్ల్ లా ముస్తాబైంది.పింక్ కలర్ డ్రెస్ లో చాలా క్యూట్ గా ఉంది. పై నుంచి కింద వరకు పింక్ కలర్ సింగిల్ డ్రెస్ ధరించింది. అయితే, క్లీవేజ్ షో మాత్రం పక్కన పెట్టలేదు. ఈ డ్రెస్ లోనూ తన హాట్ అందాలు కనిపించేలా ఫోటోలకు ఫోజులు ఇవ్వడం విశేషం. ఈ ఫోటోలు ప్రస్తుతం ఆమె అభిమానులను



విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. హౌ క్యూట్ అంటూ కొందరు, గార్జియస్ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ గా మారాయి. ఇదిలా ఉండగా, వరుణ్ తేజ్ ముకుంద సినిమాతో పూజ తెలుగు తెరుకు పరిచయమైంది. ఆ తర్వాత ఒక లైలా కోసం లో నాగచైతన్య సరసన నటించింది. ఈ రెండు సినిమాలు క్లిక్ అవ్వలేదు.మొదట్లో అందరూ బ్యాడ్ లక్ అనుకున్నారు. కానీ, తర్వాతే తాను అందరికీ గోల్డెన్ లెగ్ మారిపోయింది. రెండు వరస ఫ్లాప్ ల తర్వాత ఆమెకు అల్లు అర్జున్ సరసన డీజేలో నటించే అవకాశం వచ్చింది. అందులో గ్లామర్ డోస్ పెండచంతో అందరి దృష్టి ఆమెపై పడింది. కానీ అది కూడా క్లిక్ కాకపోవడంతో ముంబయి కి చెక్కేసింది. ఇక టాలీవుడ్ లో పూజ కెరీర్ అయిపోయినట్లే అనుకునే సమయంలో ఆమెకు అలవైకుంఠ పురంతో హిట్ పడింది. అంతే, అక్కడి నుంచి పూజ మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఆమెకు ఆఫర్లు క్యూ కట్టాయి. దాదాపు టాలీవుడ్ లోని స్టార్ హీరోలందరి సరసన ఆమే నటించింది. యువ హీరోయిన్లు ఎంత మంది వచ్చినా, పూజా స్థానాన్ని చేరుకోలేకపోయారు. కానీ, ఇటీవల కొన్ని కారణాల వల్ల ఆమె రెండు పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పుకోవడం గమనార్హం. మళ్లీ, కొత్త ఏ సినిమా సంతకం చేసినట్లు సమాచారం లేదు.



# సుప్రీంకోర్టులో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ఊరట

హైదరాబాద్ : కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ఊరట లభించింది. అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ రెండువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

ఎన్నికల అఫిడవిట్‌లో వనమా తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపిస్తూ ప్రత్యర్థి జలగం వెంకటరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు పలుమార్లు విచారించి గత నెల జులై 25న వనమాను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. జలగం వెంకటరావును ఎమ్మెల్యేగా తీసుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే కోరుతూ వనమా తొలుత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2018లో కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వనమా పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి జలగం వెంకటరావుపై 4 వేలకు పైగా ఓట్ల తేడాతో గెలుపొందారు.

# కేంద్రంలో ఈసారి సంకీర్ణమే.. మాది కీలకపాత్ర: కేటీఆర్

మన్నెగూడ: 75 ఏళ్లు దాటిన చేనేతల కార్మికులకు ప్రభుత్వమే బీమా కల్పిస్తుందని తెలంగాణ మంత్రి కేటీఆర్ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో నిర్వహించిన చేనేత దినోత్సవంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. " కొత్త మగ్గాలకు తెలంగాణ చేనేత మగ్గం అని పేరు పెట్టాం. నేతన్నలకు 16 వేలకుపైగా కొత్త మగ్గాలు ఇవ్వబోతున్నాం. నేటి నుంచే తెలంగాణ చేనేత మగ్గం పథకం అమలవుతుంది. ?40.50 కోట్లతో 10,652 ఫ్రేమ్ మగ్గాలు అందుబాటులోకి తెస్తాం. కేసీఆర్ ఎప్పుడూ టాటాలు మాత్రమే కాదు.. తాతలు మెచ్చిన కుల వృత్తులు ఉంటేనే అభివృద్ధి అంటారు.



చేనేతలకు డీసీసీబీ, టెస్కాబ్ ద్వారా ?200కోట్ల క్యాష్ క్రెడిట్ లిమిట్ అందించనున్నాం. చేనేతమిత్ర పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు ?3వేలు ఇస్తాం. ఈ పథకం ఆగస్టు, సెప్టెంబర్ నుంచి అమలు చేస్తాం. చేనేత మీద ప్రధాని మోదీ 5 శాతం జీఎస్టీ వేశారు. ఇప్పటివరకు ఏ ప్రధాని ఇలాంటి నిర్ణయం తీసుకోలేదు. చేనేత వద్దు.. అన్నీ రద్దు అనేలా కేంద్రం తీరు ఉంది. కేంద్రానికి నేతన్నల గురించి తెలియదు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుంది. అందులో భారాస కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్రంలో మళ్లీ భారాస ప్రభుత్వం ఏర్పడుతుంది" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# అసెంబ్లీలో సీఎం అభద్రతాభావంతో మాట్లాడారు..

ఖమ్మం జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో అభద్రతాభావంతో మాట్లాడారని, ప్రభుత్వం చేజారుతుందనే ఉద్దేశంతో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేయడం, రైతుల రుణ మాఫీ అంటూ ఎన్నికల కోసమే హడావుడి చేస్తున్నారని కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, ముత్యాలగూడంలో మీడియాతో మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల తర్వాత హామీలు గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ హయాంలో వైస్ రాజశేఖర రెడ్డి అడిగిన వారికల్లా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లు కాళ్లు.. అరిగేలా తిరిగినా చాలా మందికి ఇవ్వలేదని, ముఖ్యమంత్రి ఇప్పుడు చెప్పే మాటలన్నీ ఎన్నికల కోసమేనని పొంగులేటి విమర్శించారు. రాబోయే మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.




కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల రూపాయలు రైతుల రుణాలను మాఫీ చేస్తుందన్నారు. అధికారం ఉందని అక్రమ కేసులు పెడతే చూస్తూ ఊరుకోమన్నారు. పోలీసులు చేతిలో ఉన్నారని అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం మంచిది కాదని, అధికారం ఉంది కదా అని విర్రవీగితే ప్రజలు కర్రు కాసి వాత పెట్టడం ఖాయమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

# కాంగ్రెస్ కృతజ్ఞత లేని పార్టీ .. పీవీ సేవలను మరిచింది : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ : కాంగ్రెస్ కృతజ్ఞత లేని పార్టీ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. దేశానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలను మరచిపోవడమే కాకుండా మరిపించే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్ బోర్గాం(పి)లో బ్రాహ్మణ సమాజం ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు విగ్రహాన్ని పీవీ కుమార్తె , ఎమ్మెల్సీ వాణి దేవి, కుమారుడు ప్రభాకర్ రావు తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చి గాడిలో పెట్టిన మహోన్నత వ్యక్తి పీవీ అని కొనియాడారు. పీవీ కేవలం తన మేధో సంపత్తితో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళజాతి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆకర్షించేందుకు ధైర్యంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆనాడు పీవీ తీసుకున్న చర్యల వల్ల ఈ రోజు లక్షలాది మంది బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయని, కోట్లాది కుటుంబాలు దారిద్ర్యరేఖ నుంచి పైకి ఎగబాకాయన్న విషయం భారత దేశం ఎప్పటికీ మరచిపోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ బిడ్డను గుర్తించకపోతే సీఎం కేసీఆర్ పట్టుదలతో శతజయంతి ఉత్సవాలను నిర్వహించారని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా శతజయంతి ఉత్సవాలు జరిగాయని, పీవీ ఆలోచనా విధానాన్ని ఒక ఉద్యమంలా ప్రతీ తెలంగాణ బిడ్డ గుండెకు తట్టేలా చాటిచెబుతామని పేర్కొన్నారు. ప్రపంచానికి పీవీ స్ఫూర్తిని పంచుతామని అన్నారు. పీవీ నరసింహా రావు విగ్రహం ఏర్పాటుతో



నిజామాబాద్ కు కొత్త కళ వచ్చిందన్నారు. పీవీ 14 భాషల్లో మాట్లాడడం అంటే మామూలు మేధో సంపత్తికాదని కొనియాడారు. పీవీ నరసింహా రావు వంటి నాయకత్వపు లక్షణాలు అందరికీ రావాలని కోరుకుంటున్నానన్నారు. కేంద్రంలో విద్యా శాఖ మంత్రిత్వ శాఖను మానవ వనరుల శాఖ మంత్రిత్వ శాఖగా మార్చి అత్యద్భుతమైన కొత్త పద్ధతులను ప్రవేశపెట్టారని తెలిపారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా దేశవ్యాప్తంగా నవోదయా విద్యాలయాలను, పాఠశాలలను ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ , నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మహేష్ బిగాల , మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ హాజరయ్యారు.

# గగుర్పాడిచే ప్రమాదం.. ముగ్గురూ త్రుటిలో తప్పించుకున్నారు!

గుడిహత్నూర్ : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసుల, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు కంటెయినర్ వెళుతోంది.

నేరడిగొండ మండలం చించోలికి చెందిన జంగు, కృష్ణ, సంతోష్ మావల మండలం వాఘాపూర్‌లో అంత్యక్రియలకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. సీతాగోంది వద్ద ద్విచక్ర వాహనం రోడ్డు దాటేందుకు మరలుతున్నారు. అదే సమయంలో వేగంగా వస్తున్న కంటెయినర్ డ్రైవర్ వారిని గమనించి వాహనాన్ని పక్కకు తిప్పాడు. కంటెయినర్ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. చోదకుడు రషీద్ ఖాన్‌కు తీవ్రగాయాలు కాగా, క్లీనర్ ఆబిద్




ఖాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనదారులు కింద పడి చిన్న గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




# కిషన్‌రెడ్డి, రేవంత్‌లను ఉద్దేశిస్తూ గద్దర్ భౌతిక కాయం వద్ద తలసాని సంచలన వ్యాఖ్యలు..

హైదరాబాద్ : ప్రజా యుద్ధ నౌక గద్దర్ భౌతిక కాయం వద్ద మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తలసాని మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ తెలంగాణ చీఫ్ కిషన్ రెడ్డిని ఉద్దేశిస్తూ.. ఇది చిల్లర రాజకీయాలు చేసే సమయం కాదన్నారు. ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తోందన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. కొద్దిమంది అ న్నీ మీ చేస్తున్నాం అని చెప్పుకుంటున్నారన్నారు. లాల్ బహదూర్ స్టేడియం కూడా వాళ్లే అరెంజ్ చేశారు అని చెప్పుకుంటున్నారన్నారు. చిల్లర రాజకీయాలు మాట్లాడటం మానుకోవాలని తలసాని హితవు పలికారు.

**కిషన్ రెడ్డి ఏమన్నారంటే..** తెలంగాణలో పూర్తిగా అనుకున్న ఆశయాలు నెరవేకుండానే గద్దర్ వెళ్లిపోయారన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన ఎక్కడి ఇబ్బందులు అక్కడే ఉన్నాయని గద్దర్ భావించారన్నారు. దానిలో బాగంగానే ఎన్నికల్లో పోటీ చేస్తానని తనతో గద్దర్ చెప్పారని వెల్లడించారు. గద్దర్ భావించిన , ఉహించిన తెలంగాణ రాలేదని చాల బాధ పడ్డారని కిషన్ రెడ్డి తెలిపారు. నిజానికి చాలా సందర్భాల్లో గద్దర్ సైతం ఈ విషయాన్ని వెల్లడించారు.

**రేవంతే చొరవ చూపారంటూ వార్తలు..** గద్దర్ భౌతిక కాయం ఆసుపత్రి నుంచి ఎక్కడికి తరలించాలనే దానిపై ఒకింత గందరగోళం ఏర్పడింది. తొలుత అల్వాల్‌లోని ఇంటికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు భావించారు. ఆస్పత్రి వద్దకు భారీగా అభిమానులు చేరుకోవడం.. ఇంటి వద్ద తగిన స్థలం లేకపోవడంతో నిర్ణయం మార్చుకున్నారు. పలువురి సూచనల మేరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు తీసుకెళ్లాలనుకున్నారు. ఇంతలో గద్దర్ ఆడిపాడిన, ఆయనకు ఎంతో ఇష్టమైన నిజాం కాలేజీ గ్రౌండ్‌కు తీసుకెళ్తే బాగుంటుందని కొందరు కళాకారులు చెప్పడంతో ఆ దిశగానూ ఆలోచన చేశారు. అక్కడా అభిమానులను అదుపు చేయడం కష్టమని, చివరకు ఎల్బీ స్టేడియానికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పెద్దలు సూచించినట్లు తెలిసింది. సాయంత్రం. 5.30కు స్టేడియంకు తీసుకువచ్చారు. కాగా, ఎల్బీ స్టేడియంలో గద్దర్ మృతదేహాన్ని ఉంచేందుకు ప్రభుత్వం తొలుత అంగీకరించ లేదని కథనాలు వచ్చాయి. దీంతోనే టీపీసీసీ చీఫ్ రేవంత్ చొరవ చూపి స్టేడియం గేట్లు తీసుకుని లోపలకు వెళ్లి ఏర్పాట్లు చేశారని తెలిసింది.




# నడిరోడ్డుపై మహిళను దారుణంగా కొట్టి.. వివస్త్రను చేసి..

మేడ్చల్ : బాలాజినగర్ నగర్ నడిరోడ్డుపై కీచకపర్వం చోటు చేసుకుంది. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ నడిబొడ్డున సుమారు రాత్రి ఎనిమిది గంటల సమయంలో అందరూ చూస్తుండగా యువతిపై ఒక కీచకుడు అత్యంత దారుణానికి ఒడికట్టాడు. శాపింగ్ కోసం రోడ్డుపై వెళ్తున్న గుర్తుతెలియని మహిళను పెద్దమారయ్య అనే వ్యక్తి లైంగికంగా వేధించాడు. అడ్డుకోబోయిన మహిళను అతి దారుణంగా కొట్టి అందరూ చూస్తుండగానే బట్టలను చింపి వివస్త్రను చేశాడు. ఈ దారుణాన్ని అడ్డుకోబోయిన స్థానికులపై కూడా దాడి చేశాడు. ఈ తతంగమంతా తన కన్నతల్లి సమక్షంలో జరగడం, ఆ తల్లి తన కొడుకును సమర్ధించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.స్థానికల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి బాధిత మహిళకు రక్షణ కల్పించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.




# గద్దర్‌కు ప్రముఖుల నివాళి

హైదరాబాద్: ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకుడు గద్దర్ భౌతిక కాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతన్న గద్దర్.. ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. దీంతో ప్రజల సందర్శనార్థం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. ఈనేపథ్యంలో జనం గొంతుకగా నిలిచిన గద్దర్‌కు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్ రావు, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సీనియర్ నేత జానారెడ్డి, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని, సీఎం నేత జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, నివాళులర్పించారు. ఆయన భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. అదేవిధంగా సీనియర్ నటుడు మోహన్‌బాబు, అలీ, నాగబాబు, ఆయన కుతూరు నిహారిక.. గద్దర్ పార్థివదేహానికి నివాళులర్పించారు.

# ప్రియుడిపై కోపం.. 80 అడుగుల హైటెన్షన్ విద్యుత్ టవరెక్కిన బాలిక!




రాయ్‌పూర్: ప్రేమికుల మధ్య గొడవ జరిగితే.. మాట్లాడుకోకపోవడం, కొన్నాళ్లు దూరంగా ఉండడం, బతిమాలించుకోవడం చేస్తుంటారు. కానీ ఒక బాలిక ప్రియుడిపై కోపంతో ఏకంగా 80 అడుగుల విద్యుత్ టవర్ ఎక్కేసింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని మార్వాహి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గౌరెల పెండ్రా గ్రామానికి చెందిన ఓ బాలిక అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడిని కొన్నాళ్లుగా ప్రేమిస్తోంది. ఈ క్రమంలో అతడితో ఫోన్లో గొడవ పడింది.

దీంతో ప్రియుడిపై కోపంతో 80 అడుగుల ఎత్తున్న హైటెన్షన్ విద్యుత్ టవర్ పైకి ఎక్కింది. ఆమెను బుజ్జగించేందుకు అతడు కూడా టవర్ పైకి ఎక్కాల్సి వచ్చింది. స్థానికులంతా టవర్ చుట్టూ చేరి వారిని కిందకి దిగమని ప్రాధేయపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎంత నచ్చజెప్పినా వారు మాత్రం కిందకు దిగలేదు. కొన్ని గంటల తర్వాత సురక్షితంగా కిందకు దిగారు. మళ్లీ ఇలాంటి పనులకు పాల్పడవద్దని పోలీసులు వారిని మందలించి వదిలేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com